





సచివాలయాలు అస్తవ్యస్తం!

- గాడి తప్పిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ
- సమయ పాలన పాటించని ఉద్యోగులు
- అందరూ ఒక్కటై డుమ్మా కొడుతున్న వైనం
- ఉదయం 10.30లోపు సగం కూడా లేని హాజరు
- విధులు, బాధ్యతలు లేని విధానంతో ఇష్టారాజ్యం
- పర్యవేక్షణ లేని చోట్ల మరింత దారుణంగా పరిస్థితి
- తనిఖీల్లో షాకుకు గురవుతున్న ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఇటీవల తన నియోజకవర్గం పరిధిలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. ఇలా ఒక సచివాలయం కాదు.. మూడు డివిజన్లలోని సచివాలయాల్లో అదే పరిస్థితి ఆమెకు ఎదురయింది. ఒక్కో డివిజన్ పరిధిలో 50 మంది ఉద్యోగులు వుంటారని, వారెవరూ తమకు అందుబాటులో వుండడం లేదని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆమె వెంటనే ఉద్యోగులను పిలిపించి తీవ్ర హెచ్చరికలు చేశారు.

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని సచివాలయాలను పరిశీలించడానికి వెళ్లిన ఒక అధికారి షాక్‌కు గురయ్యారు. తనిఖీకి వెళ్లిన అధికారికి సచివాలయంలో ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. పైపెచ్చు ఆ సచివాలయంలో కుక్కలు పడుకుని వున్నాయి. దీంతో ఆగ్రహానికి గురైన సదరు అధికారి ఉద్యోగులను పిలిచి మందలించారు. - ఇవి ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒకటి రెండు ఘటనలు మాత్ర మే. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో ఇదే పరిస్థితి అన్ని చోట్లా కనిపిస్తోంది.

పల్నాడు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఆ జిల్లాలో మాచర్ల, వినుకొండ, గురజాల మండలా ల్లోని సచివాలయాల్లో ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతు న్నారు. ఆయా నియోజక వర్గాల్లో నమోదయ్యే ఉద్యోగుల హాజరులో ఉదయం పదిన్నరలోపు నమో దయ్యే హాజరు సగానికంటే తక్కువగా ఉంటోంది. బాపట్ల జిల్లాలో రేపల్లె నియో జకవర్గం లోని తీరప్రాంత గ్రామాల్లో, చీరాల డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు.

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన నుంచి సచివాలయ వ్యవస్థపై విమర్శలు వస్తూనే ఉన్నా యి. గ్రామ స్వరాజ్యాన్ని దెబ్బతీసే వ్యవస్థగా, చేతికి వుండే నిరర్థక మైన 'ఆరో వేలు'గా విమర్శలు ఎదుర్కొంటున్న ఆ వ్యవస్థ కాలం గడిచే కొద్దీ మరింత దిగజారిపోతూ వుంది. ప్రజలకు అం దుబాటులో వుండాలని లక్షల మంది ఉద్యోగుల ను నియమించి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో వుండడం లేదన్న విమ ర్శలను ఎదుర్కొంటోంది. సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు సగం మంది కూడా సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, ప్రజలకు అందుబాటులో వుండకపోవడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బయటకు కనిపించని ఎన్నో అంశాలు, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. సచివా లయాల తనిఖీలకు వెళ్లిన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు షాకుల మీద షాకులు తగులు తున్నా యి. ఉద్యోగులు హాజరు కావడం లేదని, తమకు అందు బాటులో వుండడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో అందుతున్నాయి.

ఒక అవగాహనతో వ్యవహారం

గ్రామ సచివాలయాల్లో మారు మూల ప్రాంతాల్లో వుండే సచివాలయాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపి స్తోంది. సచివాలయ బాధ్యతలు నిర్వర్తించాల్సిన పంచా యతీ కార్యదర్శులు కొందరు తోటి ఉద్యోగులతో ఒక అవగాహనకు వచ్చి విధులకు డుమ్మా కొడుతున్నారు. తమ వద్ద నున్న డివైజుల ద్వారా హాజరు నమోదు చేసి ఆఫీసుకు రాకుండానే చెక్కేస్తున్నారు. అధికారులు ఎవరైనా వచ్చినప్పుడు ఫీల్డ్ విజిట్లో వున్నట్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీడీవో, ఎండీవోలు తనిఖీలు చేయడానికి వీలుగా లేని సచివాలయాల్లో పరిస్థితి ఆందోళనకర స్థాయిలో వుంది. కాగా వార్డు సచివాలయాల్లో పరిస్థితి మరింత దారు ణంగా వుంది. నగరాలు, పట్టణాల్లో వున్నా అక్కడ విధులకు డుమ్మా కొట్టేస్తున్నారు. నగరం, పట్టణంలో వుండే సచివాలయాలన్నిం టిపైనా అజమాయిషీ కమిషనర్‌దే కావ డంతో పర్యవేక్షణ లోపాలు తలెత్తు తున్నాయి. దీనిని ఆసరా చేసు కుని ఉద్యోగులు విధులకు ఎగ నామం పెడుతున్న పరి స్థితి కనిపి స్తోంది.

మాతృశాఖ పేరుతో డుమ్మా!



సచివాలయ వ్యవస్థలో మొత్తం 12 శాఖలకు చెందిన ఉద్యోగులు వుంటారు. గ్రామ కార్యదర్శి, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మినహా మిగిలిన ఉద్యోగులం తా వివిధ శాఖలతో సమన్వయ బాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుంది. వెల్ఫేర్ అసిస్టెంటు సాంఘిక సంక్షేమ శాఖకు, వీఆర్వో, సర్వే అసి స్టెంటు రెవెన్యూ శాఖకు, అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టీకల్చర్ అసిస్టెంటు ఉద్యోగులు వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన శాఖ, మహిళా పోలీసులు హోమ్ శాఖతో అనుబంధంలో వుంటారు. ఇలా ఉద్యోగులంతా ఆయా శాఖలతో అను బంధంలో వుండడంతో మాతృశాఖల అధికా రులు వారిని తమ అవసరాలకోసం వాడుకోవడం ప్రారంభించారు. ఫలితంగా గడి చిన ఐదేళ్లలో చాలా మంది ఉద్యోగులు సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సేవ కు లుగా మారిపోయారు. దాన్ని అడ్డం పెట్టుకుని ఏకంగా సచివాలయ విధులకే డు మ్మా కొట్టే పరిస్థితి ఏర్పడింది. ఇలా గడిచిన ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థ అనేక రకాలుగా దెబ్బతినిపోయింది. ఫలి తంగా ఉద్యోగులు తమ బాధ్యతలకు దూరంగా మిగిలిపోయారు. దీనిని తక్షణం సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. లేకుంటే ఇది నిరర్థకమైన ఆరోవేలుగా మిగిలిపోయే ప్రమాదం వుంది.


నిరుపయోగంగా బయోమెట్రిక్ విధానం



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని గత ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతి రోజూ స్పందన కార్యక్రమానికి హాజరు కావాలనే పేరుతో కొన్నాళ్లపాటు మూడు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కొన్నాళ్లపాటు ఉద్యోగులు నిరంతరం సచివాలయాల్లో ప్రజలకు అందు బాటులో వున్నారు. కానీ బయో మెట్రిక్ విధానంతో సంబంధం లేకుండా మూడు పూటలా హాజరు వున్నవారికి, లేని వారికి ఒకే విధంగా గత ప్రభు త్వం వేతనాలు ఇవ్వడంతో ఉద్యోగులు అసలు విష యం గ్రహించారు. వేతన బిల్లులు సమర్పించే సమయంలో బయోమెట్రిక్ హా జరు కాకుండా, మాన్యువల్‌గా ఇచ్చే హాజరునే ప్రామాణికంగా తీసుకోవడం తో వేతనాలకు, బయోమెట్రిక్ హాజరుకు సంబంధం లేదని గ్రహించి ఉద్యో గులు మెల్లమెల్లగా హాజరుకు డుమ్మా కొట్టడం మొదలుపెట్టారు.. కానీ గత ప్రభుత్వం దానిపై ఎలాం టి చర్యలు తీసుకోలేదు. దీంతో బయోమెట్రిక్ విధానం పూర్తిగా నిర ర్థకంగా మారిపోయింది. రోజులో ఏ దో ఒక సమయంలో బయోమెట్రిక్ హాజరు పడితే అదే హాజరుగా పరిగణించి మ్యా న్యువల్ హాజరు పట్టీలో నమోదు చేసి చక్కగా వేతనాలు పొందుతున్నారు.

విధులు, బాధ్యతలు లేని విధానమే కారణం

గత ప్రభు త్వం హడావుడిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఉ ద్యోగుల విధులు, బాధ్యతలు ఏమిటనేది నిర్ణయించి నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకుండా వారిని ఉద్యోగ బా ధ్యతల్లో నియమించింది. దీంతో ఉద్యోగాల్లో చేరిన వారికి ఏం చేయాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. మీ సేవ ద్వారా అందించే సేవలు అం దించే పని కేటాయించారు. దాదాపు 543 రకాల సేవలు అందించాలని గత ప్రభుత్వం సూచించినా అవి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఉద్యోగులు కేవలం నాలుగైదు సంక్షేమ పథకాల బాధ్యతలకు మాత్రమే పరిమితమైపోయారు. వాటికి కూడా వలంటీర్లను నియ మించడంతో, వారిపై అజమాయి షీ చేయడమే తమ విధి అనుకునే పరిస్థితికి ఉద్యోగులు గురయ్యారు. సం స్థాగతంగా నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకపోవ డంతో లక్షలాది మంది ఉద్యోగుల సేవలు వృథా అయిపోయాయి. ప్రస్తుతం 543 రకాల సేవలకు గానూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ, ఫ్యా మిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, 1బీ అడంగల్, పాసు పుస్తకాల జారీ సేవలు వంటి నాలుగైదు సేవలు మాత్రమే అందుబాటులో వున్నాయి. దీంతో ఉద్యో గులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకుని ఉద్యోగులు మొత్తంగా విధులకు డుమ్మా కొడుతున్నారు.





సైబర్ వల

- గ్రామస్తులే లక్ష్యంగా మోసాలు
- పిల్లలపై కేసులంటూ పోలీస్ అధికారి డీపీతో కాల్స్
- బంగారం పంపిస్తామంటూ మోసం
- బంధువునంటూ వసూళ్ళు

అద్దంకి, ఆగస్టు 26 : సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి అమాయకులు విలవిలలాడుతున్నారు. రకరకాల ఆశలు చూపి అమాయకుల బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. పోలీసుల డీపీలతో కేసులంటూ బెదిరిస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రజలను బెంబేలెత్తేలా చేస్తున్నాయి. అద్దంకి పట్టణంలో స్థిరపడ్డ ముండ్ల మూరు మండలం మారెళ్లకు చెందిన సుబ్బయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి నాలుగు రోజులు కిందట ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. వరుసలు కలిపి అర్జంట్‌గా రూ.50వేల నగదు అవసరమని, ఇటీవలనే అమెరికా నుంచి వచ్చానని, తన ఫోన్ నెంబర్ బ్లాక్ కావడంతో వేరే నెంబర్ నుంచి చేస్తు న్నాని, వెంటనే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించా లని కోరాడు. దీంతో సుబ్బయ్య రూ.50వేలు ఫోన్ పే ద్వారా పంపారు. ఆ తరువాత ఫోన్ చేస్తుంటే నెంబర్ పనిచేయడంలేదని చెప్తుండడంతో విచారిం చగా మోసపోయినట్లు గుర్తించారు. ఆరా తీయగా మరో రియల్ ఎస్టేట్ వ్యాపారికి కూడా ఇదే తరహా లో డబ్బులు అడిగినట్లు గుర్తించారు. బాధితుడు సుబ్బయ్య మారెళ్ల వెళ్లి విచారించగా గుర్తు తెలి యని యువకుడు ఓ షాప్ వద్దకు వచ్చి ఫోన్‌పే ద్వారా డబ్బులు కొట్టించుకొని కమీషన్ పోను మిగి లిన డబ్బులు తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ విష యమై సుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బల్లికురవ మండలం కొణిదెనలో రెండు నెలల కిందట ఓ యువతికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి అనాథగా పరిచయం చేసుకున్నాడు. మాట లు కలిపి చెల్లెలితో సమానమని చెప్పాడు. బం గారం, ఐ ఫోన్ ఇవ్వాలనుకుంటున్నా ని అడ్రస్ వివరాలు చెపితే లండన్ నుంచి పార్సిల్ పంపి స్తానని నమ్మబలికాడు. నిజ మని నమ్మిన యువతి అన్ని వివరాలు చెప్పింది. పంపిస్తు న్నట్లు చెప్పిన బంగారం, ఐ ఫోన్ ఫొటోలు కూడా పెట్టారు. పార్సిల్‌ను ఎయిర్‌పోర్టులో పట్టు కున్నారని ఒక సారి, కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి వచ్చిందని మరో సారి ఫోన్‌లు వచ్చాయి. ఇలా రెండు విడతలుగా లక్షా 65 వేలు జమ చేసింది. మరో రెండు సార్లు తనకు తెలియకుండానే మరో రూ.65వేలు వేరే ఖాతాకు నగదు జమ అయ్యాయి. బ్యాంక్ కాల్ సెం టర్ నుంచి మెసేజ్‌లు వచ్చిన తరువాత మోసపోయి నట్లు గుర్తించింది. ఈ తరువాత ఆ ఫోన్ నెంబర్ పనిచేయడం లేదు. ఈ విషయమై యువతి బల్లికు రవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పోలీస్ అధికారి డీపీతో..

ఇటీవల కాలంలో కళాశాలలో చదువుతున్న విద్యా ర్థుల తల్లిదండ్రులకు పోలీస్ అధికారి డీపీ ఉన్న ఫోన్ నెంబర్ నుంచి కాల్స్ వస్తున్నాయి. గుర్తు తెలి యని వ్యక్తి ఫోన్ చేసి విద్యార్థి పేరు చెప్పి తండ్రి పేరుతో పిలిచి మీ అబ్బాయి గ్యాంగ్‌రేప్‌లో ఉన్నాడ ని, గంజాయి స్మగ్లింగ్‌లో ఉన్నాడని ఏదో ఒక పెద్ద కేసులో ఇరుక్కున్నాడని బయట పడాలంటే రూ.5 లక్షలు బ్యాంక్ ఖాతాకు జమ చేయాలని ఆ వ్యక్తి డిమాండ్ చేస్తున్నాడు. దీంతో విద్యా ర్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. తీరా తమ కు మారు లకు ఫోన్ చేసి చెప్పిన తరువాత తమ పిల్లలు కళాశాలలోనే ఉన్నారని నిర్ధారించుకున్న తరువాత ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇలా సైబర్ నేర గాళ్లు ఇటీవల కా లంలో రెచ్చి పోయి అమాయకుల ను వల లో వేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు.

అసైన్డ్ దొంగల్లో వణుకు..!

ఐదేళ్లలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై కసరత్తు

22ఏ భూముల రిజిస్ట్రేషన్‌లపై కూడా నివేదికలు



పందిళ్లపల్లి సమీపంలో పరాధీనమైన అసైన్డ్ భూమి

- త్వరలోనే రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్న ప్రభుత్వం
- వెలుగులోకి రానున్న మరిన్ని భూ అక్రమాలు

బాపట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు కేటా యించిన భూమి మీద వారికే యాజమాన్య హక్కులు కల్పిస్తున్నామనే ముసుగులో వైసీపీ ప్రభుత్వం భారీ భూ దందాకు పాల్పడింది. చివరి రెండు సంవ త్సరాలలో అయితే ఆకాశమే హద్దుగా వైసీపీ నేతలు చెలరేగిపోయారు. గత ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ సొంతపార్టీ నేతలకు భూ లబ్ధి చేకూర్చడానికే అన్న విధంగా తయారయింది. ఈ అడ్డగోలు భూసంతర్పణలపై అప్పట్లోనే వందల సంఖ్యల ఫిర్యాదులు జిల్లా అధికారులకు అందాయి. అధికారం అండతో వాటిని తొక్కిపెట్టి పబ్బం గడుపు కున్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో జరిగిన భూ దోపిడీని నిగ్గు తేల్చాల్సిందేననే పట్టు దలతో ఉంది. ఐదేళ్లలో నిషేధిత జాబితా(22ఏ) నుం చి తొలగించిన భూముల వివరాలతో పాటు వాటి రిజిస్ట్రేషన్ వివరాలను సమగ్రంగా అందించాలని ప్ర భుత్వం ఇప్పటికే యంత్రాంగాన్ని ఆదేశించింది. తాజాగా ఫ్రీహోల్డ్ భూములపై రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో వీటిపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిం చింది. ఇదే అంశం మీద ఇప్పటికే రెవెన్యూ విభాగంతో కలెక్టర్, జేసీ పలు దఫాలుగా సమావేశమయ్యారు. త్వరలోనే పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివే ది క ఇవ్వడానికి అధికారులు సమాయత్తమ వుతు న్నారు. అసైన్డ్ భూ ములతో పాటు చుక్కల భూము ల విషయంలో జరిగిన అడ్డగోలు రిజిస్ట్రేషన్ లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఎక్కడయితే ఎక్కువ శాతం అసైన్డ్ భూమి ఫ్రీహోల్డ్ చేయబడిందో ఆ రెవెన్యూ పరిధి లోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి అభ్యంతరాలు ఉంటే స్వీకరించడానికి ప్రభు త్వం సిద్ధమైంది.

3,804 ఎకరాలు నిషేధిత జాబితా నుంచి తొలగింపు

2003కు ముందు ప్రభుత్వం దగ్గర నుంచి భూమి పొందిన పేదలు యాజమాన్య హ క్కులు పొందడానికి అర్హులుగా గత ప్రభు త్వం నిర్వచించి సంబంధిత భూములను నిషే దిత జాబితా నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ చట్ట సవరణ ను అనుసరించి జిల్లాలో 3,804 ఎకరాల వరకు భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. వాస్తవానికి నిజంగా పేదలకే ఈ చట్ట సవరణ ఉపయో గపడి ఉంటే మేలు జరిగేదే. కానీ దీనిని అడ్డం పెట్టుకుని వైసీపీ నేతలే చాలా వరకు సదరు భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నట్లు తెలుస్తోంది. ఇలా తొలగిం చిన భూమిని ఒరిజినల్ అసైనీ పేరు మీదనే యాజమాన్య హక్కు కోసం రిజిస్ట్రేషన్ చేయా ల్సి ఉంటుంది. కానీ ఇక్కడా నిబంధనలకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరిగి నట్లు తెలుస్తోంది. నిషేధిత జాబితా నుంచి తొలగించిన వాటిలో ఇప్పటికే 300 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ అసైనీ పేరు మీద కాకుండా వేరే పేర్లు మీద జరిగినట్లు అధికారుల పరిశీ లనలో బహిర్గతమవుతోంది. 2003కు ముందు అసైన్డ్ చట్ట సవరణ ఎన్నికలకు ఏడాదిన్నర ముందు వైసీపీ తెచ్చింది. అంతకుముందు కూడా 22ఏ భూముల విషయంలో వైసీపీ నే తలు ఇష్టారీతిన అవకతవకలకు పాల్పడ్డారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా..

గుంటూరు జిల్లాలో అసైన్డ్ చట్ట సవరణ ద్వారా 939ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. 2003 కు ముందు పేదలకు పంచిన ప్రభుత్వ భూ మిని జిల్లా వ్యాప్తంగా 9,412 ఎకరాలుగా రికార్డుల్లో ఉంది. ఇదే విధంగా పల్నాడు జిల్లాలో 45,234 ఎకరాలకు గాను 4,192 ఎక రాలను నిషేధిత జాబితా నుంచి తొలగిం చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేసిన భూ వివరాలతో పాటు పరాధీనమైన అసైన్డ్ భూముల వివరాలను కూడా సమగ్రం గా సేకరించడంతో వైసీపీ భూకబ్జాదారుల్లో ఆందోళన నెలకొంది.

అన్యాక్రాంతం విషయంలో పోటీ..

బాపట్ల, చీరాల పరిధిలో దాదాపు 70,000 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు గణాంకా లు ధ్రువీకరిస్తున్నాయి. ఇందులో ఇప్పటి వరకు పేదలకు పంచింది సుమారు 40,000 ఎకరాలుగా గత ప్రభుత్వమే అధికారికంగా వెల్లడించింది. ఇందులో 20,000 ఎకరాల వరకు 2003కు ముందు పేదలకు కేటాయిం చిందే. వైసీపీ తెచ్చిన అసైన్డ్ చట్టసవరణ ప్రకారం ఈ భూమంతా యాజమాన్య హక్కు ల గొడుకు కిందకు రావాల్సి ఉంది. కానీ అలాంటిదేమి జరగకపోగా వైసీపీ నేతలకు మాత్రం అది వరంగా మారింది. పేదలకు ఇచ్చిన భూముల్లో 80 శాతం బడాబాబుల చేతుల్లోనే ఉండగా, గడచిన ఐదేళ్లలో దాదాపు పదివేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఇష్టా రీతిన వైసీపీ నేతలు అన్యాక్రాంతం చేసేశారు.

రీ సర్వేలో భాగంగా..

గతంలో చేపట్టిన రీసర్వేలోనే అనేక భూ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వేటపాలెం మండలం లోని పందిళ్లపల్లి సమీపంలో 450 ఎకరాల భూమి పరాధీనమైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 300 ఎకరాల వరకు పేదలకు కేటాయించిన అసైన్డ్ భూమి కాగా, మిగిలినది ప్రభుత్వ భూమిగా అప్పట్లో యంత్రాం గం ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. ఈ భూములు ఎవరి ఆధీ నంలో ఉన్నాయో వారందరికీ అప్పటి జేసీ నోటీసులు జారీ చేశారు. అప్పట్లో వైసీపీలోనే ఉన్న ఓ నేత ఆధీనంలోనే ఆ భూము లన్నీ ఉండడంతో నోటీసులు మినహా చర్యల విషయంలో ముందడుగు పడలేదు. ఇవే కాకుండా సూర్యలంక సముద్ర తీరంలో అసైన్డ్ భూముల్లో రిసార్టుల నిర్మాణం చేసిన వారికి కూడా గతంలోనే అధికారులు నోటీసులు ఇచ్చి ఉన్నారు. వీరంతా కూడా వైసీపీ నేతలో వారి అనుచరులో కావడంతో చర్యల విషయంలో కదలిక లేకుండా పోయింది.

మిర్చి రైతుకు.. ధరల మంట

- రోజు రోజుకూ దిగజారుతున్న ధరలు
- పెరుగుతున్న కోల్డ్ స్టోరేజీ అద్దెలు
- పెరిగిన కౌలు ధరలు
- పెట్టుబడుల కోసం తెగనమ్మాల్సిన పరిస్థితి

చీరాల, ఆగస్టు 26 : మిర్చి రైతుకు ధరల మంట కన్నీరు తెప్పిస్తోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో, ధర వస్తుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిలవ ఉంచారు. అయినా గత నెలలో ఉన్న ధరలకన్నా ప్రస్తుత ధరలు క్వింటాకు రకాన్ని బట్టి రూ.4వేల నుంచి రూ.6వేల వరకు దిగజారాయి. ఒక వైపు కోల్డ్ స్టోరేజీ అద్దెలు పెరుగుతుండగా, మిర్చి ధర ఏమో నానాటికీ దిగజారుతోంది. చీరాల, పర్చూరు వ్యవసాయ సబ్ డివి జన్‌ల పరిధిలో ఈ ఏడాది మిరప సాగుకు సాగుదారులు మల్లగు ల్లాలు పడుతున్నారు. రకాన్ని బట్టి క్వింటా రూ.4వేల నుంచి రూ.6వేల వరకు ధరలు తగ్గాయి. అందులో ప్రధానంగా తేజ, నాటు రకాలు ఉన్నాయి. ఇక బాడిగ రకం ఏకంగా క్వింటాకు రూ.15వేలకు తగ్గింది. దీంతో సాగుదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



కళ్లంలో మిర్చి

ఇదిలా ఉంటే వైట్‌బర్లీ ధరలు గణనీయంగా ఉండడంతో కౌలు ధరలు పెరిగాయి. ఆ ప్రభావం మిర్చి సాగు చేసే పొలాలపై కూడా పడింది. మిర్చి సాగుచేసే పొలాలకు ప్రస్తుతం ఎకరా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర ఉంది. అది చెల్లించే స్తోమత లేక, ప్రత్యామ్నాయ పైర్ల సాగుకు అనుకూలత లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు మిర్చి ధరలు దిగజారుతున్నా, కౌలు ధరలు పెరగడంతో కౌలు రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఈ ఏడాది సాగుకాలం సమీపిస్తోంది. దీంతో పెట్టుబడులకు, నిల్వ సరుకును విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు, పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో పంట నష్టాన్ని ప్రత్యక్షంగా చూశారు. మునిగిన మిర్చి పైరును వీకేస్తున్న రైతులకు తక్షణసాయంగా అక్కడికక్కడే రూ.2లక్షలు అంద జేశారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని మిర్చి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తొమ్మిది బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



కుంకలగుంటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నకరికల్లు, ఆగస్టు 26: కుంకలగుంటలో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం అర్ధరాత్రి సమయంలో నకరికల్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంకలగుంటలో రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారని స్థానికులు కొందరు పోలీసులకు తెలిపారు. కొనుగోలు చేసి ఒక ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ ఇంటికి చేరుకొని అక్కడ ఉన్న తొమ్మిది బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించటాన్ని నివారించేందుకు ఆకస్మిక దాడులు, కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నారు. కాగా అక్రమార్జనకు అలవాటు పడ్డ రేషన్ మాఫియా మాత్రం ఇవేమి పట్టవన్నట్టుగా గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తూనే ఉన్నారు.

జేసీబీలు.. ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసుల స్వాధీనంలో జేసీబీలు

అచ్చంపేట ఆగస్టు 26: మండలంలోని కొత్తపల్లి ఇసుక ర్యాంపులో అక్రమంగా ఇసుకను ఎత్తుతున్న రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్‌లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకట ప్రసాదు తెలిపారు. కొత్తపల్లి ఇసుక రీచ్‌లో గత 4, 5రోజులుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వీటిని స్వాధీనం చేసుకుని అచ్చంపేట స్టేషన్‌కు తరలించారు. ఇది ఇలా ఉండగా అంబడిపూడి, కస్తాల, తాడువాయి నుంచి కూడా రాత్రిపూట ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. వీటిపై కూడా పోలీసులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని కూలీ మృతి

ఈపూరు, ఆగస్టు 26: ఉపాధి కోసం వచ్చిన కూలీ మృతి చెందాడు. టిప్పర్ ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కొండ్రముట్ల సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎన్నెస్పీ కాలువ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌కు కంకరను తీసుకువచ్చిన టిప్పర్ వెనక్కి వచ్చే సమయంలో అక్కడే ఉన్న ఓటేరు శ్రీను(42)ను ఢీకొట్టడంతో నేలపై పడిపోయాడు. పైనుంచి వాహనం టైర్లు వెళ్లడంతో శ్రీను శరీరం ఛిద్రమై మృతి చెందాడు. బొల్లాపల్లి మండలం షోలాయిపాలెంకు చెందిన శ్రీను కూలి పనుల నిమిత్తం వినుకొండలోని మసీదు మాన్యంలో ఉంటున్నాడు. కూలి పని కోసం వెంచర్ వద్దకు తెలిసిన వ్యక్తి ద్వారా వచ్చాడు. వాచ్‌మెన్‌గా పని కుదుర్చుకున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు, తల్లి ఉన్నారు. శ్రీను తల్లి పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీటీ శాఖలో బదిలీలకు పచ్చజెండా

- మార్గదర్శకాల జారీతో పలువురికి స్థాన చలనాలు
- కొత్తగా ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలంటోన్న ఉద్యోగ సంఘాల నాయకులు



గుంటూరులోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం

గుంటూరు, ఆగస్టు 26: ఉద్యోగుల బదిలీలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపటంతో వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల కసరత్తు ప్రారంభమైంది. వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తూ జీవో నంబరు 170 విడుదల చేసింది. తద్వారా అర్హులైన ఉద్యోగులు, అధికారులు బదిలీలు కానున్నారు. ఈ నెల 31 లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు-1 డివిజన్ జాయింట్ కమిషనర్ మధుబాబు జోనల్ నోడల్ జేసీగా కూడా వ్యవహరించనున్నారు. నూతనంగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పైబడి సర్వీసు పూర్తి చేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీకి అర్హులుగా తెలిపారు. పాలనా సౌలభ్యం కోసం ఐదేళ్ల సర్వీసు లేకపోయినా కొన్ని బదిలీలు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో కాకుండా అన్ని కార్యాలయాల్లో బదిలీ చేసేలా సమతూకం పాటించాలని సూచించారు. వితంతు, మహిళలు, విభిన్న ప్రతిభావంతులకు, భార్యభర్తలకు సౌకర్యంగా ఉండలా బదిలీ చేయాలని అనేక సడలింపులను కూడా ప్రకటించారు. గతేడాది జరిగిన సంస్కరణల్లో భాగంగా బయటి ప్రాంతాలకు వెళ్లిన వారిలో సీనియర్లను ఇక్కడ ఏర్పడిన ఖాళీలను బట్టి తీసుకురావచ్చని కూడా సూచించారు. ఉద్యోగ సంఘం నాయకులుకు గతంలో మాదిరిగానే ఒకే స్టేషన్‌లో 9 ఏళ్ల లోపు ఉంచాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు, కొందరు అధికారుల అనాలోచిత విధానాలతో సంస్కరణల పేరుతో (ఆర్‌వో) రీజనల్ కార్యాలయాలు తీసుకొచ్చారన్న విమర్శలు ఉన్నాయి. 2022-23లో సిటీ శాఖలో సంస్కరణల్లో భాగంగా నూతనంగా విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాల్లో ఆర్‌వో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దాంతో అనేక మంది ఏసీటీవో, క్లరికల్ కేడర్ వారు బయటి ప్రాంతాల ఆర్‌వో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు ఎవరినీ వెనక్కి తీసుకొచ్చే పరిస్థితి కూడా లేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోన్-3లో ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలి

గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో రాష్ట్రంలో నాలుగు జోన్‌లుండగా మూడు ఆర్‌వో కార్యాలయాలను మాత్రమే ఏర్పాటు చేసింది. దాంతో ఉద్యోగులు ఇక్కడ నుంచి దూర ప్రాంతాలైన తిరుపతి, వైజాగ్‌కు కూడా బదిలీలపై వెళ్లాల్సి వచ్చిందని చెబుతున్నారు. పైగా గతంలో ఎటువంటి మార్గదర్శకాలు పాటించకుండా ఉద్యోగులను బలవంతంగా బదిలీలు చేశారన్న విమర్శలు కూడా ఉద్యోగ సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. జోన్-3 పరిధిలోని గుంటూరు-1, పల్నాడు డివిజన్, ఒంగోలు, నెల్లూరు డివిజన్‌ల పరిధిలో నూతన ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అర్హులపై కసరత్తు

గుంటూరు జోన్ పరిధిలో గుంటూరు-1, పల్నాడు డివిజన్, నెల్లూరు, ఒంగోలు డివిజన్‌ల పరిధిలో బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాపై నోడల్ జేసీ మధుబాబు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా జోన్ పరిధిలో ఏసీటీవోలు 19 మంది, సీనియర్ అసిస్టెంట్‌లు 36, జూనియర్ అసిస్టెంట్‌లు 21 మంది బదిలీలకు అర్హులుగా జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సారైనా బదిలీల్లో ఉన్నతాధికారుల మార్గదర్శకాలు పక్కాగా పాటించటంతో పాటు ఎటువంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీల నుంచి మినహాయింపు కోసం కొందరు ఉద్యోగులు యూనియన్‌ల నుంచి నకిలీ ధ్రువపత్రాల కోసం అమ్యామ్యాలు ముట్టచెబుతున్నట్టుగా ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది.

క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ల బదిలీల్లో ప్రతిష్టంభన



గుంటూరు జిల్లా పరిషత్ ఆవరణలో బదిలీల కోసం వచ్చిన పీఆర్ ఇంజనీర్లు

గుంటూరు సిటీ, ఆగస్టు 26: జోన్-3 పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్, ఎష్యూరెన్స్ ఇంజనీర్ల బదిలీల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. క్వాలిటీ కంట్రోల్, ఎష్యూరెన్స్ విభాగంలో బదిలీ కోసం వచ్చిన డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు అందరూ అసోసియేషన్ లేఖలతో రావటంతో పీఆర్ చీఫ్ ఇంజనీర్ బిత్తరపోయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇక్కడ తేలేది కాదన్న ఆలోచనతో ఫైల్‌ని ఈఎన్‌సీకి పంపిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. సోమవారం గుంటూరు జిల్లా పరిషత్ ఆవరణలోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో జోన్-3 పరిధిలోని సిబ్బంది బదిలీల ప్రక్రియ చేపట్టారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకున్న డీఈఈ, ఏఈఈ, జేఈ ఇతర పరిపాలన సిబ్బంది ఉదయం 10 గంటలకే జడ్పీ ఆవరణకు చేరుకున్నారు. బదిలీ ప్రక్రియను చేపట్టేందుకు వచ్చిన పీఆర్ చీఫ్ ఇంజనీర్ సీవీ సుబ్బారెడ్డి, గుంటూరు ఎస్ఈ యర్రం బ్రహ్మయ్య ఒక్కొక్కరి అర్హతలను పరిశీలించారు. సాధారణ అర్హతలు ఉన్న ఉద్యోగుల బదిలీలను ఆమోదించారు. క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ల వ్యవహారంలో చాలా మంది డీఈఈ, ఏఈఈలు అసోసియేషన్‌లో ఉన్నట్లు లేఖలు తీసుకురావటంతో ఏ నిర్ణయం తీసుకోలేదు. సుమారు 15 మంది ఈఎన్‌సీకి అసోసియేషన్ లేఖలు చూపించినట్లు తెలిసింది. వారి బదిలీలకు సంబంధించిన ఫైల్‌ను ఈఎన్‌సీకి సమర్పిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఇంతమంది డీఈఈ, ఏఈఈలు అసోసియేషన్ లేఖలు తీసుకురావటం మొదటిసారని పలువురు వ్యాఖ్యానించారు.

కుంకలగుంటలో అర్చకుని ఇంట్లో చోరీ

- రూ.1.30 లక్షల నగదు, ఆభరణాల అపహరణ



అర్చకుని ఇంటిలో పగలగొట్టిన బీరువా

నకరికల్లు, ఆగస్టు 26: మండలంలోని కుంకలగుంటలో అర్చకుడు కంజర్ల వేణుగోపాలచార్యులు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 23న తన సోదరుని కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడు గ్రామానికి వేణుగోపాలచార్యులు వెళ్లాడు. సోమవారం ఉదయం అర్చకునికి ప్రసాదం ఇచ్చేందుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వేణుగోపాలచార్యులు ఇంటికి వెళ్లాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆ వ్యక్తి వెంటనే అర్చకుని సమాచారం ఇచ్చాడు. దీంతో వేణుగోపాలచార్యులు ఇంటికి వచ్చి చూడగా ఇంటి బయట తాళాలు, ఇంట్లో తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బీరువాలు పగులగొట్టి వస్తువులన్నీ చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.1.30 లక్షల నగదు, రెండు బంగారు ఉంగరాలు, నాలుగు జతల కాళ్ల పట్టీలు, రెండు వెండి కుందులు, రెండు వెండి లాకెట్‌లు, పది గ్రాముల వెండి నాణెం, వెండి గిన్నె అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారుగా రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అర్చకుని ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఇంటికి సమీపంలో ఒక ఎరువుల దుకాణానికి సీసీ కెమెరా ఉంది. అందులోని సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. ముగ్గురు యువకులు రాత్రి 1 గంట సమయంలో సంచరించినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల విద్యార్థినుల వసతి గృహాలపై పర్యవేక్షణ శూన్యం

- వార్డెన్లు ఎప్పుడు వస్తారో తెలియని దుస్థితి
- విద్యార్థినుల చేత వెట్టిచాకిరి
- అటకెక్కిన అధికారుల తనిఖీలు



రాజాగారితోటలోని విద్యార్థినుల హాస్టల్ సముదాయం

గుంటూరు(విద్య),ఆగస్టు 26: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలనే ఆశతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కళాశాల హాస్టల్స్‌లో చేర్పిస్తున్నారు. అయితే విద్యార్థినులకు భద్రత అక్కడ డొల్ల అనే విషయం తెలిసి వారికి కంటి మీద కునుకు ఉండటం లేదు. ఇటీవల ఇంటర్ చదివే విద్యార్థినులకు ఇద్దరు యువకులు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. వారిని రాజీవ్ గృహకల్ప గదుల్లో నిర్బంధించి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన జిల్లాలో సంచలనం సృష్టంచగా, తల్లిదండ్రుల్ని కలవరపాటుకు గురి చేసింది. విద్యార్థిల్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన హాస్టల్ వార్డెన్లు కొన్నిచోట్ల విద్యార్థినులతో పనులు చేయిస్తూ వారి భద్రతను రోడ్డుమీదకు నెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు హాస్టళ్ల గదులు ఊడ్చడం, వంట కోసం కూరగాయాల్ని తరగడం, బయట నుంచి కూరగాయలు, పాలు, పెరుగు తీసుకురావడం వంటి పనులకు విద్యార్థినుల్ని ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కనిపించని కమిటీలు..

ఉమ్మడి జిల్లాలో కళాశాల స్థాయి విద్యార్థినుల కోసం నియోజక వర్గాల వారీగా హాస్టళ్లు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థినులు వసతి పొందుతూ ఇంటర్ నుంచి పీజీ స్థాయి ఒక్కో హాస్టల్‌లో సగటున 100 మంది వసతి పొందే అవకాశం ఉంది. ఒక్కో హాస్టల్ నిర్వహణ కోసం ప్రభుత్వం విద్యార్థినికి రూ. 400 నుంచి 500 వరుకు చెల్లిస్తుంది. విద్యార్థినులు ఒక కమిటీగా కళాశాల హాస్టళ్లు నిర్వహించుకోవాలి. అయితే ఇది ఎక్కడా కనిపించదు. హాస్టల్ నిర్వహణ అంతా వార్డెన్ల కనుసన్నల్లోనే సాగుతుంది. హాస్టల్‌ను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా మహిళా వార్డెన్లు ఏర్పాటు చేశారు. అయితే వారు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

- అరండల్‌పేటలో బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఓ అద్దె భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నారు. అక్కడ వార్డెన్ విద్యార్థినుల చేత కూరగాయలు తరగడం, వంట పాత్రలు శుభ్రం చేయించడం, గదుల్ని శుభ్రం చేయించడం చేస్తున్నారని అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల తాము చదివే కళాశాల అధ్యాపకులు తమ చేత మరుగుదొడ్లు కడిగిస్తున్నారని చెప్పి బోరున సదరు విద్యార్థినులు విలపించారు.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మరో హాస్టల్‌లోనూ విద్యార్థినుల చేత ఉదయం, సాయంత్రం పరిసరాలు శుభ్రం చేయించడం చేయిస్తున్నారు. వంట మనిషి లేకుంటే తామే వంటలో కూడా సాయం చేయాల్సిన వస్తుందని విద్యార్థినులు వాపోతున్నారు.
- జ్యూట్‌మిల్లు పక్కనే(చంద్రమౌళీశ్వరపురం) ఉన్న హాస్టల్‌లో కూడా విద్యార్థినుల చేత పని చేయిస్తున్నారు. విద్యార్థినులు పెరుగు, కూరగాయల కోసం బయటకు వెళ్లిన సమయంలోనే వారిని ఏమార్చి కిడ్నాప్ చేసిన విషయం పోలీసుల దర్యాప్తులో బహిర్గతం అయిన విషయం తెలిసిందే. ఇక్కడ పనిచేసే వార్డెన్ విధుల్ని సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- రవీంద్రనగర్‌లో ఉన్న మైనార్టీ విద్యార్థినుల హాస్టల్‌లో కూడా భద్రత లేదనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే చోట హాస్టల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకునే అకాశం కూడ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.
- రాజాగారితోటలోని విద్యార్థినుల హాస్టల్ నుంచి యథేచ్ఛగా నిత్యావసర సరకులు తరలిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పని చేసే సిబ్బంది వంట సామగ్రిని మిగుల్చుకుని వార్డెన్ లేని సమయంలో తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పర్యవేక్షణ అంతంత మాత్రమేననే వాదన ఉంది.
- కళాశాల హాస్టళ్ల పర్యవేక్షణను అధికారులు దాదాపు పట్టించుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యార్థినుల భద్రత, వారి సమస్యలపై దృష్టిపెట్టి సమీక్షించిన దాఖలాలు లేవు.
- కొన్నిచోట్ల రెండు, మూడు హాస్టళ్లను ఒకే వార్డెన్ పర్యవేక్షించాల్సి వస్తుంది. దీంతో మొత్తంగా వారు విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రతి రోజూ తెల్లవారు జామున వచ్చి అల్పాహారం, భోజనం పర్యవేక్షించాలి. మళ్లీ సాయంత్రం 4 గంటలకు వచ్చి రాత్రి 8.30 వరకు ఉండాలి. అయితే ఇలా విధులు నిర్వర్తించే వార్డెన్లను వేళ్ల మీద లెక్కించవచ్చునని అధికారులే చెబుతున్నారు.
- కళాశాల హాస్టళ్లు అన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. యజమానులకు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారు నిర్వహణను గాలికి వదిలేదస్తున్నారు. కనీసం విద్యుత్, నీటి సమస్యలు కూడా పరిష్కరించడం లేదని విద్యార్థినలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఏ కోర్సులో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్



రవి తేజ

పొన్నూరుటౌన్, ఆగస్టు 26: కంపెనీ సెక్రటరీ కోర్సులో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్‌ను పొన్నూరుకు చెందిన చందు రవి తేజ సాధించాడు. కంపెనీ సెక్రటరీ కోర్సులో రెండు దశలు ఉండగా మొదటి దశ సీఎస్ ఎగ్జిక్యూటివ్, రెండో దశ సీఎస్ ప్రొఫెషనల్. సీఎస్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో ఫలితాలను ఆగస్టు 25న ప్రకటించారు. దేశంలో ప్రకటించిన 16 ర్యాంక్‌ల్లో చందు రవితేజకు 11వ ర్యాంక్ వచ్చింది. 16 ర్యాంక్‌ల్లో 14 మంది ఉత్తర భారతదేశానికి చెందిన వారు కాగా రవి తేజ ఏపీకి చెందిన వ్యక్తిగా నిలిచారు. గతంలో సీఎంఏ ఇంటర్‌లో ఆల్ ఇండియా 31వ ర్యాంక్‌ను సాధించారు. చిన్నతనం నుంచి కూచిపూడి నృత్యంలో రాణించిన రవితేజ కంపెనీ సెక్రటరీ కోర్సులో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించడంపై పొన్నూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

143 జీవోను వెంటనే రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఆగస్టు 26: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఇబ్బంది కలిగించే 143 జీవోను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వలన వచ్చిన 143 జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మండల వ్యవస్థను కనుమరుగు చేయాలన్న దురాలోచనతో జగన్ ప్రభుత్వం చట్టబద్ధత లేని సచివాలయ వ్యవస్థను తెచ్చి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుందన్నారు. 143 జీవో వలన వచ్చిన రీడిపార్ట్‌మెంట్ వలన రెండేళ్లుగా ఉద్యోగులు ఒక చోట ఉద్యోగం చేస్తూ మరో చోట జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం సత్వరమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఇద్దరు బాలురుపై పోక్సో కేసు నమోదు


తాడికొండ, ఆగస్టు 26: తనను ప్రేమించకపోతే రేప్ చేస్తానని బెదిరించిన బాలుడు, బాలికపై తన స్నేహితుడితో కలిసి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలుర్లపై తాడికొండ పోలీసులు పోక్స్ యాక్ట్ కింద కేసును సోమవారం రాత్రి నమోదు చేశారు. సీఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన ఓ బాలిక తల్లి, అన్నతో నివాసం ఉంటూ స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21 తేదీన బాలికకు అనారోగ్యంగా ఉండటంతో స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. అయితే అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలుర్లు బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడ్డారు. బాలిక నిద్ర పోవటాన్ని గమనించి బాలిక నోరు మూసి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాలిక పెద్దగా కేకలు వేయటంతో ఇంటిపైన నివాసం ఉంటున్న ఓ మహిళ కిందకు రావటంతో ఇద్దరు బాలుర్లు పారిపోయారు. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లి, అన్నకు చెప్పలేదు. కాగా బాలికకు భయంతో జ్వరం వచ్చింది. దీంతో తల్లికి జరిగిన విషయాన్ని చెప్పింది. స్కూల్‌కి వెళ్లే సమయంలో తన వెంటపడి ప్రేమించక పోతే రేప్ చేస్తానని బెదిరించేవాడని తెలిపింది. తన కూమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలురపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పొన్నూరుటౌన్, ఆగస్టు26: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పొన్నూరు పట్టణానికి చెందిన వంట మేస్త్రి టి.జయ ఈ నెల 23న గుంటూరు గాంధీ పార్క్ వద్ద ఓ వ్యక్తిని వంట పని కోసం మాట్లాడుకుని పొన్నూరు తీసుకొచ్చారు. ఈ నెల 24న సాయంత్రం వంట పనిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి సమీపంలోని డ్రైనేజి కాల్వలో పడిపోయాడు. సదరు వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతుడి వివరాలు తెలియకపోవటంతో చేతి మీద ఉన్న పచ్చబొట్ల ఆధారంగా మృతుడిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14,600 క్యూసెక్కుల నీరు విడుదల

- డెల్టా కాలువలకు 16,538 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 26: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 31,138 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు ఎత్తి దిగువకు 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16,538 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 26: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,104 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,503 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,503 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట ఆగస్టు 26: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ తెలిపారు. ఎగువ నుంచి 32,760 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 33,623 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందని తెలిపారు.

1.0541 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 26: నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0541 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన మూడు గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 24 వేలు, టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8875 మొత్తంగా 32875 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 26: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 7508 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 330 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1889, తూర్పు కాల్వకు 692, పశ్చిమకాల్వకు 220, నిజాంపట్నం కాల్వకు 400, కొమ్మమూరు కాల్వకు 3280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

కర్లపాలెంలో అగ్ని ప్రమాదం.. 9 గృహాలు దగ్ధం


లంకకాల్వ కట్టపై అగ్నిప్రమాదంలో దగ్ధమౌతున్న పూరిళ్లు

కర్లపాలెం,ఆగస్టు 26 : కర్లపాలెంలోని లంకకాల్వ కట్టపై సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించి 9గృహాలు బుగ్గిపాలయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాల్వకట్టపై దశాబ్దాలుగా 25 కుటుంబాలవారు పూరిళ్ళు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. కూలీపనులు చేసుకొని జీవనం సాగించే వీరంతా ప్రతిరోజు ఉదయం పనులకు వెళ్లి సాయంత్రానికి ఇంటికొస్తుంటారు. ఎప్పటివలే సోమవారం కూడా పనులకు వెళ్ళిన తర్వాత మధ్యాహ్నం 2గంటల సమయంలో ఒక్కసారిగా ఓ ఇంట్లో నుంచి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో చుట్టుపక్కల ఉన్న ఇళ్ళకు వ్యాపించాయి. మొత్తం 9 గృహాలు క్షణాలలో బుగ్గిపాలయ్యాయి. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలు ప్రమాద సంఘటన చూసి బోరునవిలపించారు. ప్రమాదంలో మచ్చా నరసింహ, కొమ్మరగిరి శివయ్య, తుపాకుల తిరుమలేష్, ఈగా కోటయ్య, గంధం వెంకటేశ్వర్లు, నక్కా సుబ్బారావు, ఈగా పెద్దయ్య, కొణేటి పోతురాజు, దాసరి నరేంద్ర గృహాలు పూర్తిగా బుగ్గిపాలయ్యాయి. మరికొన్ని గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో మిగిలామంటూ బోరున విలపించారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

అగ్నిప్రమాదం గురించి తెలుసుకున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, ఆర్డీవో గంధం రవీందర్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తహసీల్దార్ వెంకటరత్నం, అధికారులు, నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. బాధితులన ఓదార్చారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా సాయం అందిస్తామని హామీనిచ్చారు. నష్టం అంచనా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలటీడీపీ అధ్యక్షులు వై.భూపతిరావు, నాయకులు మాడా శ్రీనివాసరావు, పేరలి ధనుంజయ, పిట్ల వసంతరెడ్డి, ఏకసిరి నరసింహ, గ్రామకార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీసుజాత, జనసేన నాయకులు నామన వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారి ఆలయానికి వెండి పూజ పాత్ర వితరణ


ఆలయ ఈవోకి వెండి పూజపాత్ర అందజేస్తున్న దాత నీలి సత్యఫణికుమార్

పిట్టలవానిపాలెం, ఆగస్టు 26: మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న బగళాముఖి అమ్మవారికి చందోలు గ్రామవాసి నీలి చంద్రశేఖరరావు తనయుడు సత్యఫణికుమార్ వెండిపూజ పాత్ర వితరణ చేశారు. సోమవారం రూ.70వేల విలువైన 730 గ్రాముల వెండిపూజ పాత్రను అమ్మవారికి దాత అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. దాతకు ఆలయ కార్యనిర్వహణాధికారి వేద ఆశీర్వచనాలు అందజేసి శాలువాతో సత్కరించి అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాలను బహూకరించారు.

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై శ్రద్ధ చూపాలి

● సీపీఐ సీనియర్ నాయకుడు జేబీ శ్రీధర్

బాపట్ల, ఆగస్టు 26: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలని సీపీఐ సీనియర్ నాయకుడు జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని చెప్పే ప్రభుత్వాలు ధరల పెరుగుదలను అరికట్టకపోవటం దారుణమన్నారు. ప్రజల ఆదాయం మాత్రం పెరగటంలేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన ప్రభావం చాలా దన్నట్లు జీఎస్టీ పేరుతో దోపిడి చేస్తూ సామాన్యులను అతలాకుతలం చేస్తున్నారని విమర్శించారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగుమందుల ధరలు నియంత్రించకపోగా పండించిన పంట నిల్వకు గిడ్డంగులు లేక రైతులు రోడ్డుపాలవుతున్నారన్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని పౌరసరఫరాలశాఖ ద్వారా 14రకాల నిత్యావసర సరుకులు తక్కువ ధరకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మామిడి బత్తుల అశోక్, ఎం వెంకటేశ్వరరావు, మామిడిబత్తుల గణేష్, డి.ఆంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజారావుకు బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు


కవిత సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గుదే రాజారావును సన్మానిస్తున్న మదర్ సర్వీస్ సొసైటీ నాయకులు, సభ్యులు

బాపట్ల, ఆగస్టు 26: కవిత సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు గుదే రాజారావుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డును సోమవారం అందజేశారు. విజయవాడలో మదర్ సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నాయకులు, సభ్యులు కలిసి రాజారావుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థిని ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన సీహెచ్ వేద శ్రీనిధిని అభినందిస్తున్న నిర్వాహకులు

బాపట్ల, ఆగస్టు 26: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకుపల్లిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన అండర్-15 బాలబాలికల చెస్ పోటీలలో బాపట్ల లిటిల్ ఏంజెల్స్ విద్యార్థిని సీహెచ్ వేదశ్రీనిధి ఉత్తమ ప్రతిభను కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఎంపికైన వేదశ్రీనిధిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున వేదశ్రీనిధి ప్రాతినిత్యం వహిస్తుదని స్కూల్ యాజమాన్యం తెలిపింది.

ప్రముఖ పారిశ్రామికవేత్త రవికిరణ్‌కు పితృవియోగం

కొల్లూరు, ఆగస్టు 26 : ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్ తండ్రి తాతారావు ఆదివారం రాత్రి కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం మండలపరిధిలోని జువ్వలపాలెంలోని రవికిరణ్ నివాసంలో ఆయన తండ్రి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తన ప్రగాడ సానుభూతి, సంతాపం తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మరాజు సుబ్బారావుకు మాతృవియోగం


వరదానమ్మ (ఫైల్‌ఫోటో)

బాపట్ల, ఆగస్టు 26: బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యుడు తిమ్మరాజు సుబ్బారావు తల్లి తిమ్మరాజు వరదానమ్మ సోమవారం మృతి చెందారు. మృతురాలి భర్త తిమ్మరాజు కృష్ణమూర్తి రైతు నాయకుడిగా, సర్పంచ్‌గా, మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన ఇటీవల కన్నుమూశారు. వరదానమ్మ మృతికి పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


రామకృష్ణ విద్యానిలయంలో గోపికల వేషధారణలో చిన్నారులు

రేపల్లె, ఆగస్టు 26: పట్టణంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కృష్ణుడి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పాతపట్నంలోని పేటేరు రోడ్డులో శ్రీకృష్ణాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణుడికి వెన్నపూస, నైవేద్యం పెట్టారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని అందించారు. పట్టణంలోని రామకృష్ణ విద్యానిలయంలో విద్యార్థులతో శ్రీకృష్ణుడు గోపికల వేషధారణతో, చిన్నారులతో ఆట, పాటలు నిర్వహించారు. అనంతరం చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాండురంగ స్వామి దేవాలయంలో ..

బాపట్ల, ఆగస్టు 26 : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్లో ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయం నందు సోమవారం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

యాదవయూత్ ఆధ్వర్యంలో..

బాపట్ల, ఆగస్టు 26: పట్టణంలోని 3వవార్డు రైలుపేటలో యాదవ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, యలవల వెంకటేశ్వర్లు, బొడ్డు గోవిందు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో

పిట్టలవానిపాలెం, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం యువకులు వైభవంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జీఎస్‌పాలెం, మంతెనవారిపాలెం, అల్లూరు, యాదవపాలెం గ్రామాలతోపాటు సంగుపాలెం గ్రామంలోని కుర్పాలెం గ్రామస్థులు, మహిళలు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నుంచే శ్రీకృష్ణాలయాల్లో మహిళలు, యువతీ యువకులు, గ్రామపెద్దలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. యువకులు అధికసంఖ్యలో గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు రూరల్ సీఐ బందోస్తు

బాపట్లరూరల్, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా బాపట్ల మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న వేడుకలకు బాపట్ల రూరల్ సీఐ కె.గంగాధరరావు సోమవారం పోలీసు బందోబస్తు నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వేడుకల్లో ఎటువంటి ఘటనలు జరగకుండా, డీజే సౌండ్ సిస్టమ్‌ను ఎక్కువగా లేకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేడుకలు నిర్వహించుకోవాలని సూచనలు చేశారు.

వేమూరు మండలపరిధిలో

వేమూరు, ఆగస్టు 26 : మండలపరిధి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘాల వారు కృష్ణ మందిరాల్లో పూజలు జరిపి సాయంత్రం స్వామివారి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. జంపనిలో తూర్పు కృష్ణ మందిరం పడమర కృష్ణ మందిరం సంఘాల వారు విశేషంగా మందిరాలను అలంకరించి పూజలు జరిపారు.

భట్టిప్రోలు, కొల్లూరు, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరులో కృష్ణాష్టమి పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులను కృష్ణుని వేషధారణలో అలంకరించి ఉట్టి కార్యక్రమాలు జరిపారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలతో పాటు రథోత్సవం నిర్వహించారు.


కొల్లూరులో కృష్ణుని వేషధారణలో చిన్నారులు

సాగునీరు లేక రైతుల అవస్థలు

● నాట్లు వేసుకునేందుకు సిద్ధం చేసిన పొలాలు
● నేటికీ పంటకాల్వల్లోకి నీరు రాని వైనం


పూడివాడ గ్రామంలో పంటకాల్వలో చుక్కనీరులేని దుస్థితి


సాగునీరు లేకపోవటతో ఎడారిగా మారిన పొలం

నగరం, ఆగస్టు 26: సాగునీరు అందక రైతులు నాట్లు వేసుకోలేని పరిస్థితి నగరం మండలంలో నెలకొంది. నియోజకవర్గంలోని రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు వేసినా నగరం మండలంలో విరుద్ధంగా ఉంది. పంటకాల్వల్లోకి సాగునీరు అందకపోవటంతో పంట పొలాలు వరినాట్లకు సిద్ధం చేసుకున్నా నాట్లు వేసే పరిస్థితి లేక రైతులు లబోదిబోమంటున్నారు. నగరం మండలం పూడివాడ, కొలగానివారిపాలెం, ఉత్తర పాలెంలో నారుపోసి 40రోజులు కావొస్తున్నా నేటికి సాగునీరు అందకపోవటంతో పొలాలు ఎడారిగా మరాయి, బోర్ల సాయంతో నారు మడులను బతికించుకునే పరిస్థితుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నీరు అందక నారు ఎండిపోతున్నా చేసేదేమి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు నెల పూర్తి కావస్తున్న ఈదుపల్లి ఛానల్ రామస్వామి కాల్వల నుంచి చుక్కనీరు అందకపోవటంతో మరోపక్క వరుణుడు కరుణించకపోవటంతో ఈ ఏడాది నాట్లు వేసే యోగ్యత లేదా అని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సుమారు 5వేల ఎకరాలు పైనే నాట్లుకు సిద్ధం చేసుకున్నా నీరు లేకపోవటంతో పెట్టిన పెట్టుబడి అంతా వృథా పోయే పరిస్థితి నెలకొందని జలవనరుల శాఖాధికారులు ఇప్పటికైన దృష్టి సారించి సాగునీరు అందించాలని కోరుతున్నారు.

పశుపోషణ రైతులు పథకాలను సద్వినియోగించుకోవాలి

● సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు


పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ జనార్దనరావు

వేమూరు, ఆగస్టు 26 : ప్రభుత్వం పశు పోషణ రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు కోరారు. వేమూరులో సోమవారం ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి హాజరైన జనార్ధన్‌రావు మాట్లాడుతూ గోకులం పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఒక్కొక్క మండలానికి 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేసే విధంగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. 185 దరఖాస్తులు రాగా ప్రభుత్వం తమకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం 125 దరఖాస్తులను సిఫార్సు చేశామన్నారు. పశువుల షెడ్లకు 90శాతం, సబ్సిడీ మేకలు, కోళ్ళకు సంబంధించిన షెడ్లకు 30 శాతం సబ్సిడీ మేకలు, కోళ్ళకు సంబంధించిన షెడ్లకు 30 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. నాటు గేదెలు, గొర్రెలు, మేకలు, ఆవులకు పశు బీమా పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీపై ఈ బీమా వర్తిస్తుందన్నారు. నియోజకవర్గానికి రెండు లక్షల 20వేల రూపాయల ప్రీమియం ఇచ్చారు. ఈ నిధులతో 500 పశువులకు బీమా చేస్తున్నట్లు పేర్కొన్నారు. 52,500 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. బ్రూసి ల్లా జబ్బు రాకుండా ముందస్తు జాగ్రత్త కోసం నాలుగు నెలలు పైబడిన ఆడ దూడలకు టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగనన్నకాలనీ ప్లాట్లను ఆక్రమించుకుంటున్న వైసీపీ నేతలు


జగనన్నకాలనీలోని ప్లాట్లలో పశువుల మేతను జల్లుకున్న వైసీపీ నేత

చెరుకుపల్లి, ఆగస్టు 26: వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీపేరుతో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేసింది. అయితే కొంత మంది వైసీపీ నేతలు తమ ఇష్టానుసారంగా ప్లాట్లను ఆక్రమించుకుని పశువుల మేతను పెంచుకుంటున్నారు. అదేవిధంగా వైసీపీ నేత తన పంట భూమి పక్కన ఉన్న ప్లాటును ఆక్రమించుకుని వెదసాగు చేసుకుంటున్నాడు. అధికారులు ప్లాట్లను అభివృద్ధి చేయకపోవడంతో క్రమంగా ప్లాట్లను ఆక్రమించుకునే ప్రయత్నాలను మొదలుపెట్టారు. ఎవరైనా అడిగి తమ ప్రభుత్వం ఇచ్చింది మాఇష్టం అంటూ మాట్లాడుతున్నారని కాలనీలోని పట్టా దారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం మాకు ఇచ్చిన 1.5సెంట్లు ఉన్న స్థలంలో ఇళ్ళు నిర్మించుకుందామంటే ప్లాట్లలో అభివృద్ధి చేయలేదని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గృహాలు నిర్మించుకోలేకపోయామ ని వాపోతున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేతల ఆక్రమణలు ఆగలేదని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. అధికారులు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారేమోననే వారు లేకపోలేదు. ఆక్రమణలను అరి కట్టాలంటే అధికారులు కాలనీలోని ప్లాట్లను పరిశీలించి అభివృద్ధి చేస్తే గృహలను నిర్మించుకుంటామని పట్టాపొందిన పలువురు కోరుతున్నారు. ప్లాట్లు ఆక్రమించుకున్న వారి ప్లాట్లను విడిపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఆక్రమంగా వెదసాగు చేసుకున్న వైసీపీ నేత

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ

తెనాలి అర్బన్, ఆగస్టు 26: నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ అవగాహన కల్పించారు. రూరల్ మండలం అంగలకుదురులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదరణ పెరుగుతుందని నియోజకవర్గంలో కూడా సభ్యత్వ నమోదు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి ప్రతి ఒక్కరిని సభ్యులుగా చేర్చుకోవాలని చెప్పారు. రూరల్ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, సభ్యత్వ ప్రముఖ్ పాండురంగ విఠల్, వాసుదేవనాయుడు, అనంతాచార్యులు, యోగానందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీ

● జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి

చేబ్రోలు, ఆగస్టు 26: సమాన్య కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయి నాయకుడి వరకు ఉన్నత విలువలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అని ఆ పార్టీ విశేష సంపర్ అభియాన్ రాష్ట్ర కోకన్వీనర్ జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అన్నారు. చేబ్రోలులో సోమవారం మండల సభ్యత్వ నమోదు సనాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రామలింగేశ్వర శాస్త్ర మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేది నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తునట్లు చెప్పారు. మిస్డ్ కాల్ విధానం, నమోదు యాప్, క్యూఆర్ కోర్డ్ విధానంలో సభ్యత్వం నమోదు చేసుకోవచ్చున్నారు. గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ఈ సభ్యత్వ నమోదు నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాసరావు, దూపం శివశంకర్, ఈ నాగేశ్వరరావు, అన్నపురెడ్డి సాంబిరెడ్డి, శీలం గోపి, గుర్ర శ్రీనివాసరావు, మాడ సీతరామచయ్య, చెరుకుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పక్కాగృహాలు నిర్మిస్తాం

● కలెక్టర్ జె.వెంకటమురళి ● బాధిత కుటుంబాలకు తక్షణ సాయం


బాధిత కుటుంబాలకు సాయం అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు

బాపట్ల, ఆగస్టు 26: నియోజకవర్గంలోని కర్లపాలెంలో లంక కాల్వకట్టపై జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన సోమవారం ఘటనా స్థలానికి చేరుకొని అధికారులతో కలిసి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. తొమ్మిది గిరిజన కుటుంబాల గృహాలు దగ్ధమైనట్లు గుర్తించారు. వీరందరికి త్వరలో రూ.4లక్షల 30వేలతో పక్కా గృహాలు నిర్మించేలా చర్యలు చేపడతామని ప్రకటించారు. తక్షణ సాయంగా నిత్యావసర వస్తువులతోపాటు ప్రతి కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం, రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ బి.సుబ్బారావు, ఆర్డీవో గంధం రవీందర్, తహసీల్దార్ వెంకటరత్నం, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే నరేంద్రవర్మ

● వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.10వేల చొప్పున అందజేత


బాధిత కుటుంబాల వారికి రెడ్‌క్రాస్ కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు తదితరులు

కర్లపాలెంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే వేగే శన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి వెళ్ళి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని హామీనిచ్చారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేల చొప్పున ఎమ్మెల్యే వ్యక్తిగతంగా అందజేశారు. బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు అందజేసిన రెడ్‌క్రాస్ కిట్‌లను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త నాయుడు వెంకటనారాయణ వ్యక్తిగతంగా ప్రతికుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వై.భూపతిరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, షేక్ బాజి, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, తహసీల్దార్ వెంకటరత్నం, గ్రామకార్యదర్శి ఎం శ్రీనివాసరావు, మాడా శ్రీనివాసరావు, గిరిజన నాయకుడు ఏకసిరి నరసింహారావు, పేరలి ధనుంజయ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీలో రెండు పూరిళ్లు దగ్ధం


వైఎస్సార్ కాలనీలో దగ్ధమైన పూరిళ్లు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 26: మండలంలోని భవనవారిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మత్యే హుస్సేన్‌రెడ్డి, మత్యే అసీన్‌రెడ్డిలకు చెందిన రెండు పూరిళ్ల షార్ట్‌సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా స్థానికులు మంటల ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కార్యక్రమంలో స్థానికులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులను ఇంటి పరిసరాల్లో కట్టడి చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

బాపట్ల, ఆగస్టు 26: పట్టణ పరిధిలో ఆవులు, పందులు, గాడిదలను యజమానులు తమ ఇంటి పరిసరాలలో కట్టడి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్ల మీదకు వదిలిపెడితే వాటిని పురపాలక సిబ్బంది స్వాధీనం చేసుకుంటారన్నారు. యజమానులు తమ పశువులను ఇష్టానుసారంగా రోడ్లపై వదిలివేయటం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పందుల పెంపకం దారులు పురపాలక సంఘం నుంచి అనుమతులు, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వాటిని ప్రజారోగ్యం దృష్ట్యా స్వాధీనం చేసుకొని బందెల దొడ్డికి తరలిస్తామని కమిషనర్ తెలిపారు. ఆ తర్వాత యజమానులకు జరిమానాలు విధించటం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్న క్యాంటిన్‌లో మున్సిపల్ కమిషనర్ తనిఖీ


అన్నక్యాంటిన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల, ఆగస్టు 26 : బాపట్ల పురపాలక సంఘంలోని అన్న క్యాంటిన్‌ను మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. భోజనం రుచిగా ఉందా లేదా అని.. అలాగే సదుపాయాల గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆకలితో వచ్చిన ప్రతి ఒక్కరికి అన్నం పెట్టాలని సిబ్బందికి సూచించారు. వారితో మర్యాదగా మసలుకోవాలని సూచించారు.

వైకుంఠపురంలో మహాసంప్రోక్షణ పూజలు ప్రారంభం

తెనాలి అర్బన్, ఆగస్టు 26: వైకుంఠపురం ఆలయంలో కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్ఠ మహా సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు సోమవారం మొదలయ్యాయి. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠ చేస్తారు. మొదటి రోజు విష్వక్సేన ఆరాధన, గర్భాలయం, జీవధ్వజం, ఉత్సవ విగ్రహాలు, శిలా విగ్రహాలు, శిఖరాలకు వాస్తుహోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. సాయంత్రంవేళ కూడా పూజలు కొనసాగాయి. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, సభ్యులు సునీత, సరస్వతీ, వెంకటరమణ, ప్రసాద్, ఆళహరి రవి తదితరులు పాల్గొన్నారు. ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

కొల్లిపర, ఆగస్టు 26: ఆయుష్మాన్ మందిర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మున్నంగిలో యోగా శిక్షకులుగా పని చేయటానికి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషుల నుండి దరఖాస్తు చేసుకోవాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి సాయికుమార్ అన్నారు. ఆసక్తి కలిగిన వారు 9391399194లో సంప్రదించాలని తెలియజేశారు.

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'



గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. అనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956'ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3Y60EZ7లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజినీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్పాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.



హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు

'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాలభాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.



ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టినరోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.



హిందువులేనా అని అడిగారు

కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్ళిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికెట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్టను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్ల పాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళి నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య ప్రొడక్షన్ కంట్రోలర్ నోబల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్ధిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. "చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహించనున్నారు.

రిమ్స్‌కు శిశువు

పొన్నలూరులో కేసు నమోదు.. డాక్టర్ల పర్యవేక్షణలో పాపాయి

విచారణ చేపట్టిన పోలీసులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 26: తల్లి పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన బిడ్డ కొందరి నిర్వాకంతో రాష్ట్రమే దాటింది. అయితే అధికారుల చొరవతో చివరకు రిమ్స్‌కు చేరింది. కన్నతల్లే పుట్టినబిడ్డను ఆసుపత్రిలోనే అమ్మకానికి పెట్టి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన వారికి విక్రయించింది. ఆమె స్వయంగా అంగన్‌వాడీ కార్యకర్త కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే బాలల హక్కుల కమిటీ ఫిర్యాదు మేరకు స్పందించిన ఈనెల 25న పోలీసులు పొన్నలూరులో జీరో ఎఫ్ఐఆర్‌తో కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం పొన్నలూరు నుంచి కేసును ఒంగోలు వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. పొన్నలూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఆ బిడ్డకు తల్లి కావడంతో ఐసీడీఎస్ శాఖలో కలకలం రేగింది. విచారణ చేపట్టిన పోలీసులు ఖమ్మం జిల్లా కల్లూరులో ఉన్న శిశువును తెప్పించారు. జీజీహెచ్(రిమ్స్) ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో పాపను ఉంచారు. అదేవిధంగా కన్నతల్లి, మధ్యవర్తులుగా వ్యవహరించిన పద్మవతి, బ్రహ్మయ్యతోపాటుగా శిశువును కొనుగోలు చేసిన బాలసుందరరావును ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

20 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

అసోసియేషన్ చైర్మన్ గరటయ్య



మాట్లాడుతున్న డాక్టర్ గరటయ్య

పంగులూరు, ఆగస్టు 26 : పంగులూరులో సెప్టెంబర్ 20, 21, 22 తేదీలలో 34వ రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య ప్రకటించారు. సోమవారం పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల బాలికల ఖోఖో జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ 14 సంవత్సరాల విభాగంలో జరిగే పోటీలో 13 జిల్లాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఇక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీల నిర్వహణకు దాతలు, పెద్దలు, గ్రామ ప్రజలు, క్రీడాధికారుల సహకారం అభినందనీయమన్నారు.సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, రోటరీ క్లబ్ క్యాంప్ కోఆర్డినేటర్ వీరరాఘవయ్య, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, భవనం కాశీ విశ్వనాథరెడ్డి, పరిషత్ ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ సుబ్బారావు, కరణం హనుమంతరావు, జాగర్లమూడి సుబ్బారావు, బాచిన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఫారసు లేఖల కోసం బారులు

పారదర్శకంగా చేయాలంటున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), ఆగస్టు 26 : నిబంధనల మేరకు బదిలీలకు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు తమకు జరిగే స్థానచలనంలో అనుకూలమైన చోటుకు బదిలీ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సిఫారసు లేఖల కోసం సోమవారం పెద్ద సంఖ్యలో ఉద్యోగులు టీడీపీ కార్యాలయం వద్ద బారులుతీరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య అవకాశం ఉన్నంత మేర ఎవరికీ ఇబ్బంది లేకుండా పలు సూచనలు చేస్తూ బదిలీకి సంబంధించిన సిఫారసు లేఖలను అందించారు. కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగం ఎక్కడ అనేది చూడకుండా, పనిచేసే చోట ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పారదర్శంగా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. వచ్చినవారు అసంతృప్తి చెందకుండా వీలైనంత వరకు నిబంధనలకు లోబడి సంబంధీకులకు బదిలీ సిఫారుసు లేఖలను అందజేశారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

పంట ఉత్పత్తిని నియంత్రించాలి

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

వేలం కేంద్రాల్లో కొనుగోళ్ల పరిశీలన

టంగుటూరు, ఆగస్టు 26 : రైతులు వచ్చే సీజన్‌లో అనుమతి మేరకే పొగాకును పండించాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. పంట నియంత్రణ పాటిస్తేనే గిట్టుబాటు ధరలు లభిస్తాయని చెప్పారు. ఆయన సోమవారం టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలను సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. పంట పరిమాణాన్ని స్థిరీకరించాల్సిన అవసరాన్ని వివరించారు. గత, ప్రస్తుత సీజన్‌లో లభిస్తున్న ధరలను చూసి బ్యారన్లు, పొలాలు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. ఎప్పటికప్పుడు బోర్డు అధికారుల సూచనలను పాటిస్తూ నాణ్యమైన పొగాకు పండించి లాభాలు పొందాలని కోరారు. పొగాకు రైతులంతా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బ్యారన్‌కు పది మొక్కలు నాటాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈసందర్భంగా వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు రైతులతో కలిసి చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. తొలుత వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎస్‌జీవో జి.సిద్ధరాజు, బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పి వరప్రసాదరావు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, బోర్డు సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన కొండపిలో వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. రెండేళ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తి తగ్గినందున ఇక్కడ మంచి ధరలు లభించాయన్నారు. వచ్చే సీజన్‌లో వివిధ దేశాల్లో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో అధిక ధరలకు పొలాలు, బ్యారన్లు కౌళ్లకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు.

ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

రెండునెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి

దర్శి, ఆగస్టు 26 : ఈత సరదా యువకుల ప్రాణాలను హరిస్తుంది. దర్శి మండలంలో రెండు నెలల్లో నీటిలో మునిగి ఏడుగురు మృతి చెందారు. ఉజ్వల భవిష్యత్తుతో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఆశించిన తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. ఆ కుటుంబాలు శోక సముద్రంలో మునిగిపోతున్నాయి. మూడురోజుల క్రితం కొత్తపల్లి,లక్ష్మీనారాయణపురం, కొర్లమడుగు గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాగర్ కాల్వలో పడి మృతిచెందారు. తొలిరోజు ఒక మృతదేహం లభించగా, మరుసటి రోజు మిగిలిన రెండుమృతదేహాలను గాలించి వెలికితీశారు.ఈదుర్ఘటనతో ఆమూడు కుటుంబాలు శోకసముద్రంలో మునిగి పోగా, మూడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.అంతకుముందు జూన్ 13న దర్శి మండలం లూధగిరి కాలనీకి చెందిన బోడే నవీన్, కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన వి.చందులు శివరాజ్ నగర్ వద్దగల ఎన్ఏపీ చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. నవీన్ పుట్టినరోజు సందర్భంగా స్నేహితులను విందుకు పిలిచి తనతోపాటు చదువుకుంటున్న చందును కూడా ఆహ్వానించారు. భోజనాలు పూర్తయిన తరువాత వీరిద్దరూ ఎన్ఏపీ చెరువు వద్దకు వెళ్లి ఈతకు దిగి విగతజీవులయ్యారు. ఆ తరువాత జూన్ 30న తూర్పువీరాయపాలెం వాగులో ఏర్పాటు చేసిన కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన ధర్నాశి వీరమణికంఠ, అద్దంకి మండలం వేలమూరిపాడుకు చెందిన పులి రాఘవేంద్ర అక్కాచెల్లెళ్ల కుమారులు. తూర్పువీరాయపాలెంలో జరిగిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఉదయం బహిర్భూమికి వెళ్లి వాగులో నీటి నిల్వ కోసం తీసిన కుంటలో పడి మృతి చెందారు. రెండు నెలలకాలంలో మూడు దుర్ఘటనలలో ఏడుగురు విద్యార్థులు నీటిలో మునిగి విగతజీవులయ్యారు. ఆ కుటుంబాల్లో విషాదఛాయలు ఇప్పటికీ ఆరిపోలేదు. మూడురోజుల కిత్రం సాగర్ కాల్వలో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందటం ఆమూడు గ్రామాల్లో ప్రజల్ని కలిచి వేస్తుంది. భవిష్యత్తులో చిన్నారులు ఇలాంటి దుర్ఘటనలకు బలికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసం ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నీటి వద్ద వద్దకు వెళితే జరిగే ప్రమాదాలు తెలియపరిచి వారిని చైతన్యవంతుల్ని చేస్తే ప్రమాదాలను అరికట్టే వీలుంటుంది..

బదిలీల హైరానా..!



కీలక శాఖల్లో మార్పులకు ప్రభుత్వం ఆదేశం

ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ఆరాటం

కూటమి నేతల ద్వారా సిఫార్సు లేఖల కోసం ఒత్తిళ్లు

కోరుకున్న స్థానాల కోసం కొందరు పైరవీలు

వైసీపీతో అంటకాగిన వారిలో ఆందోళన

నెలాఖరుకు ముగియనున్న ప్రక్రియ

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో కీలకశాఖల్లో పనిచేస్తున్న వారు అనుకూలమైన స్థానాల కోసం వేట ప్రారంభించారు. పోస్టింగ్‌లలో అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యం ఉండటంతో అత్యధిక శాతం మంది ఉద్యోగులు టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతల ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు. కూటమి పార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నేతల ద్వారా వారిపై ఒత్తిళ్లు పెంచుతున్నారు. సిఫార్సుల లేఖలు పొందేందుకు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు గతంలో తమకు పరిచయం ఉన్న టీడీపీ నేతలు, పైస్థాయి అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. మరి కొందరు స్థానిక నేతలను వివిధ రూపాలలో ఆకర్షించి పైరవీలు కూడా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేసమయంలో ఐదేళ్లుగా వైసీపీ నేతలతో అంటకాగిన ఉద్యోగులు హైరానా పడుతున్నారు. ఎలాగోలా టీడీపీ ఎమ్మెల్యేలను కలిసేందుకు మార్గాలను వెత్తుకుంటున్నారు.

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల తర్వాత ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. అభ్యర్థన విధానంలో స్థానచలనానికి అవకాశం ఇచ్చింది. మండల స్థాయిలో కీలకమైన రెవెన్యూలోని డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, అలాగే ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈలతోపాటు గ్రామస్థాయిలోని వీఆర్వో, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బదిలీలపై వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ ముఖ్య నేతలు దృష్టిసారించారు. అలాంటి వారు జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చినచోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

15 కీలక శాఖల్లో బదిలీలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాలనను గాడిలో పెట్టడంపై దృష్టిసారించింది. తొలుత కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్ తర్వాత డీఎస్పీల బదిలీలు చేపట్టింది. ప్రస్తుతం మండల, గ్రామ, పట్టణ స్థాయిలోని వివిధ శాఖల ఉద్యోగుల బదిలీలపై దృష్టిసారించింది. ఇప్పటికే తహసీల్దార్లు, సీఐ, ఎస్ఐల నియామకాలు దాదాపు ఒక కొలిక్కి వచ్చాయి. తాజాగా 15 కీలక శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, రిజిస్ట్రేషన్, దేవదాయ, పరిశ్రమలు, పౌరసరఫరాల వంటి శాఖలతోపాటు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులు బదిలీలు కానున్నారు. ఈనెల 19 నుంచి 31 లోపు ప్రక్రియ పూర్తికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఒకే పట్టణం లేదా గ్రామంలో ఐదేళ్లు పనిచేసిన వారు విధిగా బదిలీ కావాల్సి ఉంది. మిగిలిన వారు జీరో సర్వీసుతోనూ కావాలనుకొంటే బదిలీ కోరుకోవచ్చు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇంచుమించు ఆయాశాఖల్లో అందరూ బదిలీ అయ్యే అవకాశం ఉంది.

కొందరు ముందస్తుగానే లేఖలు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రస్తుతం జిల్లాలో ఏప్రాంతంలో పనిచేస్తున్న వారు అక్కడే లేదా పొరుగు నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం అధికారపార్టీ నేతలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. బదిలీలలో అధికారపార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యం ఉంటుందన్నది బహిరంగ సత్యం. దీంతో వారిని ప్రసన్నం చేసుకొని సిఫార్సు లేఖలు పొందేందుకు పోటీపడుతున్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో జిల్లావ్యాప్తంగా సిఫార్సుల లేఖల కోసం వచ్చిన ఉద్యోగులతో జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధుల గృహాలు, కార్యాలయాల వద్ద రద్దీ నెలకొంది. బదిలీలు ఉంటాయని గ్రహించి నెలక్రితమే కొందరు ఉద్యోగులు కీలక నేతల వద్ద హామీలు, తదనుగుణంగా లేఖలు కూడా తీసుకొన్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ పూర్తికి గడువు సమీపిస్తుండటంతో అధికారపార్టీ ప్రజాప్రతినిధులపై ఒత్తిడి మరింత పెరిగింది. తమకు అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగుల పోస్టింగుల కోసం కూటమి పార్టీలకు చెందిన మండల, గ్రామస్థాయి నేతలు కూడా తమ అధినాయకులపై ఒత్తిళ్లు పెంచారు.

కుదరని ఏకాభిప్రాయం

నలుగురు జిల్లా అధికారుల పోస్టులపై తర్జనభర్జన

అధికారపార్టీ నేతల తీరుపై ఆరా తీస్తున్న అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో అధికారుల బదిలీల వ్యవహారంపై అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిదులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా మూడు, నాలుగు శాఖల జిల్లా అధికారుల నియామకం విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్రంలో అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ వేగవంతమైన విషయం తెలిసిందే. కిందిస్థాయిలో ముఖ్యమైన అధికారుల బదిలీలు జరిగి వివిధ శాఖల ఉద్యోగుల బదిలీల వ్యవహారం ప్రస్తుతం నడుస్తోంది. కిందిస్థాయిలో పోలీసు, రెవెన్యూ ముఖ్య అధికారుల నియామకంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక పంథాను అనుసరిస్తోంది. పోలీసు శాఖలో డీఎస్పీల నియామకాన్ని పైనుంచే నిర్వహించారు. సీఐల నియామకంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సూచించిన వారిపై కూడా ప్రత్యేక పరిశీలన చేసి సరైన వారు కాకపోతే వేరేవారిని నియమించారు. ఆర్డీవోలు, డీఎస్పీల విషయంలో ఎమ్మెల్యేలు చెప్పినవి విన్నారే తప్పా అధిష్ఠానం అనుకున్న వారికే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక కలెక్టర్, ఎస్పీలది అయితే అధిష్ఠానమే ఎంపిక చేసింది. కొన్ని గంటల ముందు ఆ విషయాన్ని జిల్లా మంత్రికి మాత్రమే సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రకాశం జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యే ఇన్‌చార్జులు సమావేశమై నియోజకవర్గ స్థాయిలో ఎవరికి వారు చూసుకోవాలని, జిల్లాస్థాయి అధికారుల బదిలీలపై ఉమ్మడిగా మాట్లాడుకొని ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

నాలుగు, ఐదు శాఖలపై సమస్య

కాగా జిల్లాస్థాయిలోని ఆయా శాఖల అధికారుల నియామకానికి సంబంధించి వస్తే అధికారపార్టీ నేతలు పూర్తిస్థాయిలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ప్రధానంగా జడ్పీ సీఈవో, డీపీవో, విద్యుత్ శాఖ ఎస్ఈ, మైనింగ్ డీడీ, ఏడీ, డ్వామా పీడీ తదితర అధికారుల నియామకం విషయంలో నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. తొలుత జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల సంతకాలతో కొన్ని పోస్టులకు సిఫార్సు లేఖలను తయారుచేశారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఒక ఎమ్మెల్యే సదరు సిఫార్సు లేఖలపై సంతకం పెట్టి మిగిలిన వారి వద్దకు పంపగా వారు ఆ లేఖలపై సంతకాలు చేశారు. అయితే అందులో మంత్రి స్వామి సంతకం లేకపోవటం విశేషం. అయితే ఆరంభంలో ఒకటి రెండు శాఖల అధికారుల విషయంలో సదరు అధికారి మంత్రి స్వామిని కలవకపోయినా సీనియర్ నాయకుడు ఫోన్ చేయటంతో ఆయన కూడా ప్రత్యేకంగా సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే చివరకు వచ్చేసరికి మంత్రి సిఫార్సు లేకుండానే ఆయా శాఖల అధికారులను నియమించాలని ఆయా మంత్రులకు లేఖలు పంపారు. మంత్రి సంతకం లేకపోవటంతో కొన్ని శాఖల వారు ఆ సిఫార్సులను పక్కనపెట్టారు. తదనంతరం మంత్రి వైపు నుంచి సీఈవో, డీపీవో, మైనింగ్ శాఖ అధికారుల నియామకానికి సంబంధించి వేరే అధికారుల పేర్లు సూచిస్తూ లేఖలు ఆయా శాఖలకు వెళ్లాయి. ఉదాహరణకు డీపీవోగా పశ్చిమప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే సిఫార్సుతో ఒక అధికారి పేరును తొలుత సూచించారు. అయితే మంత్రి స్వామి కొండపి నియోజకవర్గం నుంచి సింగయ్య అనే అధికారి పేరు సూచించారు. ఉన్నతాధికారులు తొలుత ఎమ్మెల్యే సూచించిన అధికారి పేరును తిరస్కరించినట్లు తెలిసింది. తాజాగా కలెక్టర్ జోక్యం చేసుకొని ముఖ్యమైన శాఖ అయినందున తమకు సమర్థవంతమైన అధికారి కావాలని డీపీవో విషయాన్ని వదిలేయాలని ఇటు మంత్రిని కొందరు సీనియర్ నాయకులను కోరినట్లు తెలిసింది. అయితే సీనియర్ ఎమ్మెల్యే ఆ ప్రతిపాదన అంగీకరించకపోవటంతో సమస్య ఎదురైంది. జడ్పీ సీఈవోగా మంత్రి సిఫార్సు లేకుండా ఒక పేరు ఎమ్మెల్యేలు సూచించగా మంత్రి ఉన్నతస్థాయిలో నాయకుల సిఫార్సుతో మరోపేరు సూచించారు. జడ్పీ పాలకమండలి వైసీపీ చేతిలో ఉండటంతో ఉన్నతస్థాయిలో ఆలోచించి ఒక అధికారిని మంత్రి సూచించగా ఎమ్మెల్యేలు ఇంకో అధికారిని సూచించటంతో సమస్య ఉత్పన్నమైంది. డ్వామా పీడీ విషయంలో ఒక ఎమ్మెల్యే ఒకరిని సూచించగా అత్యధికులు ఆ అధికారిని తీవ్రంగా వ్యతిరేకించారు. మైనింగ్ అధికారుల విషయంలోను జిల్లా ఎమ్మెల్యేల నుంచి ఒకటి, రెండు పేర్లు అధిష్టానంకు చేరాయి. విద్యుత్ శాఖకు కట్టా వెంకటేశ్వర్లు అనే అధికారి నియామకానికి అందరూ సిఫార్సు చేశారు. అయితే అతనికి పదోన్నతి లేకుండా ఇన్‌చార్జి ఇవ్వాలా వద్దా అనే విషయంలో సీఎం సూచన ప్రకారం నడుస్తానని మంత్రి రవికుమార్ తెలిపినట్లు తెలిసింది. ఈలోపు ఒకరిద్దరు నాయకులు ప్రస్తుత ఎస్ఈనే కొనసాగించాలని సూచించటంతో మిగిలిన వారు వారి నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం.

ఆరా తీస్తున్న అధిష్ఠానం

కాగా జిల్లాస్థాయి అధికారుల బదిలీల విషయంలో జిల్లా నేతల మధ్య ఏకాభిప్రాయం ఎందుకు లభించలేదనే విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పాటు సీఎంవో అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లా నేతల సూచించిన ప్రతి అధికారి పనితీరుపై సీఎంవో అధికారులు పరిశీలన చేస్తున్నారు. కొన్ని శాఖల మంత్రులు అయితే మీరందరూ ఏకాభిప్రాయంతో ఒకపేరు సూచించాలని అప్పటిదాకా నియామకాలు జరపబోమని తేల్చిచెప్పినట్లు తెలిసింది. గతంలో ఉమ్మడి జిల్లా నేతలంతా ఏకాభిప్రాయంతో నడిచారు. ఇప్పుడు తాజా పరిస్థితి ఎందుకు వచ్చిందనే విషయంపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేకంగా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఉద్యోగాల పేరుతో మోసం!

వైసీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలి

అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయించాలి

కలెక్టరేట్ ఎదుట బాధితుల ర్యాలీ, ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 26: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం జాగరణ్‌మంచ్ రాష్ట్ర కన్వీనర్ షేక్ మహ్మద్ బుజ్జి డిమాండ్ చేశారు. జాగరణ్‌మంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరురాలు షేక్ సల్మాసుల్తానా, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు పీఏ బండారు సురేష్‌ల అక్రమాలపై సిట్ దర్యాప్తు చేయించాలని కోరారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని జిల్లావ్యాప్తంగా పలువురు వద్ద లక్షలు వసూలు చేసి, ఫేక్ జాబ్ లెటర్లు సృష్టించారని ఆరోపించారు. ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకు చెందిన దొంతాల మహేష్‌కు మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో పోస్టు, దొంతాల మనోహర్, కనిగిరికి చెందిన ఒగ్గు వెంకటేశ్వర్లుకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.23లక్షలను సుల్మాసుల్తానా తన ఫోన్‌పే అకౌంట్‌కు పలుదఫాలుగా వేయించుకున్నారని ఆరోపించారు. కలెక్టర్ పేరుతో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని తెలిపారు. అవి ఫేక్ అని తెలియడంతో ప్రకాశం, బాపట్ల ఎస్పీలకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు కూడా నమోదు చేశారన్నారు. వారితో మరికొంత మంది కలిసి రూ.2కోట్ల వరకు వసూలు చేశారన్నారు. డబ్బులు తిరిగి అడుగుతున్నారని బాధితులను బెదిరిస్తున్నారని, వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు టీడీపీ నాయకుడు ఎస్.సుబ్బారావు గుప్తా, చెరుకూరి ఆదిలక్ష్మిలు సంఘీభావం తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అద్దంకి బస్టాండ్ నుంచి పాత మార్కెట్ సెంటర్, ట్రంకురోడ్డు, చర్చిసెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో పలువురు నిరుద్యోగులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

అటవీ సంపదపై అక్రమార్కుల కన్ను

చెట్లు నరికి దొడ్డిదారిన తరలింపు

బ్యారన్ యజమానులకు విక్రయం

పట్టించుకోని అధికారులు



తరలించేందుకు సిద్ధంగా ఉన్న అటవీ కర్ర



చెట్లను నరకగా మోడుబారిన సిరిమాను మొదలు

పీసీపల్లి, ఆగస్టు 26: అటవీ సంపద తరలిపోతోంది. కొంతమంది అక్రమార్కులు చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. ఈఏడాది సీజన్‌కు ముందే చెట్లను నరకుతూ బ్యారన్‌లకు తరలిస్తున్నారు. కర్రకు డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారుల కన్ను అటవీ చెట్లపై పడింది. అటవీ సమీపంలో ఉన్న చెరువులు, పొలాల్లో ఉన్న చెట్లను నరికేందుకు ఆయా గ్రామాల ప్రజలతో చర్చించి దేవస్థానాల అభివృద్ధికి నగదు చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఆతరువాత చెరువులు, పొలాల్లో చెట్లను కొట్టుకునేందుకు ఒప్పందం చేసుకున్న వ్యాపారులు సమీపంలోని అడవిలో ఉన్న చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. తరలించిన కర్రను బ్యారన్ యజమానులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కందుకూరు, వెంకుపాలెం, చెన్నుపాడు, అగ్రహారం, పొన్నలూరు తది తర గ్రామాల్లో పొగాకు అధికంగా సాగుచేస్తారు. పొగాకు కాల్పునకు అవ సరమైన కలప అక్కడి రైతులకు అందుబాటులో లేదు. దీంతో ఆయా ప్రాంతాల బ్యారన్ యజమానులు పీసీపల్లి మండలంలోని కర్ర వ్యాపారు లను ఆశ్రయిస్తున్నారు. ఈఏడాది పొగాకు మంచి ధర పలకడంతో సాగు విస్తీర్ణం అధికంగా పెరగనుంది. దీంతో సీజన్ ఆరంభానికి ముందు నుం చే కర్రకు డిమాండ్ పెరిగింది. బ్యారన్‌కు కర్రను తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతితో ప్రభుత్వానికి చలానా తీసి పర్మిట్‌ల ద్వారా తుమ్మ, చిల్ల తదితర కలపను వ్యాపారులు విక్రయించేవారు. ప్రస్తుతం తుమ్మ, తదితర కలప అధిక ధరలు పలుకుతుండడంతో కొంత మంది వ్యాపారుల చూపు అడవిపై పడింది. అటవీ కర్ర అయితే కొనే అవసరం ఉండదని, కేవలం కొట్టుడు కూలీ మాత్రమే చెల్లిస్తే అధికంగా సొమ్ము ఆర్జించవచ్చునన్న ఆలోచనతో దొరికిన చోటల్లా అటవీ సంపదను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారు లు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ సంపదను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్‌ల నిలిపివేత


ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దర్శి, ఆగస్టు 26 : దర్శి నగర పంచాయతీలోని అక్రమ లేఅవుట్లలో క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో అక్రమ లేఅవుట్లపై చర్యలేవీ శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇప్పటికే పట్టణంలోని అక్రమ లేఅవట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆ సర్వే నెంబర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు చేయకుండా నిలుపుదల చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సూచించినట్లు పేర్కొన్నారు. ఈ లేఅవుట్లలో ఎలాంటి భవన నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామన్నారు.

తక్కెళ్లపాడు గ్రామస్థులకు ఎక్కిళ్లు!

- రూ.50లక్షలతో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన పైలెట్ ప్రాజెక్ట్
- ఏళ్లుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- జమ్ము, చిల్లకంపతో మూసుకుపోయిన చెరువు
- నిరుపయోగంగా ఫిల్టర్ బెడ్
- ఇంటింటికీ తాగునీరందని దుస్థితి


నీటినిల్వ కోసం నిర్మితమైన మంచినీటి చెరువు దుస్థితి


రక్షిత మంచినీటి ట్యాంక్


ఏళ్ల తరబడి ఇసుక మార్పిడికి నోచుకోని రెండో ఫిల్టర్ బెడ్


నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్

పంగులూరు, ఆగస్టు 26 : ఇంటింటికీ నీరందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. దీంతో తక్కెళ్లపాడు గ్రామస్థులకు ఎక్కిళ్లు తప్పడం లేదు. గ్రామంలో బోర్లు, బావులు ద్వారా లభించే ఉప్పు నీటితోనే ప్రజలు నీటి అవసరాలను తీర్చుకునే దుస్థితి నెలకొంది. నాటి పాలకులు గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో 2003లో రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన (రక్షిత మంచినీటి పథకం) పైలెట్ ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారింది. సుమారు 17వందల జనాభా ఉన్న తూర్పు తక్కెళ్లపాడు ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు ఆ నాటి తెలుగుదేశం ప్రభుత్వం రూపకల్పన చేసిన పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రూ.50లక్షల నిధులు మంజూరు చేయగా, నీటి నిల్వసామర్థ్యం కోసం అవసరమైన చెరువు నిర్మాణానికి ప్రముఖ వేద పండితులు దివంగత శ్రీశైలనాథన్ అయ్యంగార్ కుటుంబ సభ్యులు 20 ఎకరాల సాగు భూమిని ఉచితంగా సమకూర్చారు. నీటి నిల్వ కోసం చెరువు నిర్మాణంతో పాటు గ్రామంలో ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు పైప్ లైన్ ఏర్పాటు, లక్ష లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల నీటి ట్యాంక్, ఫిల్టర్ బెడ్‌లను నిర్మించి కొళాయిలను ఏర్పాటు చేసి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్ట్ నిర్వహణకు కమిటీని నియమించి కొన్ని సంవత్సరాలు నీటి సరఫరా సజావుగా సాగించారు. అనంతరం గ్రామంలో పైప్‌లైన్ పాడైందని కొళాయి దగ్గర ప్రజలు నీటిని పట్టుకునే విషయంలో గొడవలు పడుతున్నారంటూ నీటి సరఫరా నిలిపివేశారు. ట్యాంక్ దగ్గరకు వచ్చి ప్రజలు నీటిని పట్టుకునేందుకు వీలుగా రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద ప్రత్యేకంగా ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. ఇది సజావుగా జరగని పరిస్థితిలో ప్రజలకు తాగు నీరైనా అందించాలనే ఉద్దేశంతో ఈ పథాన్ని ఆర్వో ప్లాంట్‌కు పరిమితం చేశారు. ఆర్వో ప్లాంట్ ద్వారా అందించే నీటి విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కలగా మిగిలిన ఇంటింటికీ నీటి సరఫరా

ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో ప్రజల నీటి అవసరాలు తీర్చాలని మంజూరు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహణ అటకెక్కింది. దాతలు చెరువు కోసం ఇచ్చిన పదుల ఎకరాల భూమిలో నిర్మితమైన చెరువు మరమ్మతులకు నోచుకోని దుస్థితి ఏర్పడింది. పూడిక, జమ్ము, చిల్లకంపతో మూసుకు పోయిన చెరువులో నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. రక్షిత మంచి నీటి కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్ జమ్ముతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. ఉన్న రెండో ఫిల్టర్ బెడ్‌లో ఎన్నో ఏళ్లుగా ఇసుక మార్చక పోవడంతో నీరు సరిగా ఫిల్టర్ కావడం లేదు. గత కొన్నేళ్లుగా నీటి అవసరాలు తీరక ఇబ్బంది పడుతున్నామని, తమ మొర ఎవరూ ఆలకించడంలేదని, సమస్యను ప్రభుత్వం గుర్తించాలని ప్రజలు వేడుకుంటున్నారు. తమ నీటి అవసరాలు తీరేలా చెరువులో పూడిక, జమ్ము తొలగించి నీటి నిల్వలు పెంచాలని, గ్రామంలో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఫిల్టర్ బెడ్లకు తగిన మరమ్మతులు చేపట్టి ఇంటింటికీ రక్షిత మంచి నీటి సరఫరా జరిగేలా ప్రభు త్వం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


చెక్కులను కమిషనర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అన్న క్యాంటీన్‌కు దాతల సాయం అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 26 : పేదల పాలిట అన్నపూర్ణగా సీఎం చంద్రబాబు ఆశీస్సులతో కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌కు దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఇప్పటి వరకు అన్న క్యాంటీన్‌కు చెక్కుల రూపేణా పలువురు అందజేసిన సుమారు రూ.5లక్షలను ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పెళ్లిరోజు, పుట్టినరోజుల లాంటి ప్రత్యేక సమయాలలో దాతలు అన్న క్యాంటీన్‌లో భోజనాల ఏర్పాటుకు సహకారం అందించే విధంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు దాతలు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 26 : మండల పరిధిలోని కఠారివారిపాలెంలో పేకాట శిబిరంపై వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి సోమవారం నిర్వహించిన దాడులలో 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

డెంగ్యూతో మహిళ మృతి



వంకాయలపాడు(ఇంకొల్లు), ఆగస్టు 26 : వంకాయలపాడు గ్రామంలో మహిళ డెంగ్యూ జ్వరంతో సోమవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బేతపూడి మరియమ్మ(51) 10 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. తొలుత పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందగా డెంగ్యూగా నిర్ధారించారు. వెంటనే ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సరైన వైద్యం అందకపోవడంతో అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సుమారు రూ.5లక్షల వరకూ ఖర్చు చేసినా ఫలితం లేకపోగా సోమవారం మరియమ్మ మృతి చెందారు.

పారిశుధ్యం అధ్వానం

ఇదిలావుండగా వంకాయలపాడులో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఎక్కడ మురుగు అక్కడే నిలిచి కంపుకొడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వంకాయలపాడు ఎస్సీ కాలనీలో పెద్ద సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్నారని, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

పొలాల్లో సోలార్ ప్యానల్ వైర్లు చోరీ


మాయమైన ప్యానెల్‌ను చూపుతున్న రైతు

మార్టూరు, ఆగస్టు 26 : మండల పరిధిలో ఇసుకదర్శి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు చెందిన పొలాల్లో సోలార్ ప్లేట్లకు చెందిన ప్యానల్ వైర్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకు పోయారు. అంతేగాకుండా విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైరును కూడా కూడా కత్తిరించి తీసుకుపోయారు. దాంతో ఒక్కో రైతుకు 5 నుంచి 7వేల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు రైతులు చెప్తున్నారు. గతంలోనూ ఇలాగే పొలాల్లో చోరీ చేయగా, మరలా కొత్తగా వైర్లు బిగించుకున్నామని, మళ్లీ ఇప్పుడు దొంగతనం జరిగిందని రైతులు వాపోతున్నారు. ఒకే పొలంలో ఇది మూడోసారి అని కొంతమంది రైతులు తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కామేపల్లి సురేంద్ర, మారెళ్ల సుబ్బారావు, వెలగా సుబ్బయ్య, కాకర్ల రామాంజనేయులు, నల్లూరి సుబ్బయ్య తదితర రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కొత్తపేట(చీరాల), ఆగస్టు 26 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను డ్రైవర్‌తో సహా 216 జాతీయ రహదారిలో సోమవారం ఎక్సైజ్ సీఐ కర్త, సిబ్బందితో కలసి పట్టుకున్నారు. ట్రాక్టరు, డ్రైవర్‌ను టూటౌన్ పోలీసులకు అప్పగించామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తారని సీఐ తెలిపారు.

వరి సాగుకు సాగర్ నీరివ్వాలి


పంగులూరు, ఆగస్టు 26 : సాగర్ ఆయకట్టు కుడి కాలువ పరిధిలో వరి సాగుకు నీరందించాలని రైతు సంఘం ప్రతినిధులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, తలపనేని రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఆయకట్టు కుడి కాలువ పరిధిలో ఆరుతడి పంటలకే నీరు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తిగా నీటితో నిండిపోయి నీరంతా సముద్రం పాలవుతుందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తిగా నిండిపోయాయని, సాగు నీటికి, తాగునీ టికి ఈ సంవత్సరం ఎలాంటి ఇబ్బంది ఉండబోదని రైతులు భావిస్తున్నా రన్నారు. ప్రభుత్వం మాగాణి సాగుకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై ధర్నా

మార్టూరు, ఆగస్టు 26 : మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజాలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ బాధ్యుడు బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ నెల కొందట కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వరుసగా ఐదు రోజులు ప్లాజా వద్ద ధర్నా చేపట్టామన్నారు. దాంతో ఇద్దరు ఉద్యోగులలో ఒకరిని మహారాష్ట్రకు బదిలీ చేసి, మరొకరిని విధుల నుంచి తొలగించారన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్లాజా మేనేజర్ కిరణ్ కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీహెచ్ మజుందార్, కందిమళ్ల రామకోటేశ్వరరావు, తల్లపనేని రామారావు, రాంబాబు, కృష్ణమూరి, మార్టూరు, యద్దనపూడి, జె.పంగులూరు మండలాల రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమంలో కుట్టు శిక్షణ ప్రారంభం

మార్టూరు, ఆగస్టు 26 : అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలలోని మహిళలకు ఆసరాగా ఆశ్రమంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షురాలు షేక్ హబీజాన్ మాట్లాడుతూ 45 రోజులు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తామన్నారు. మొదటిరోజు 20 మంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో జాష్టి అనూరాధ, గుంటుపల్లి చందు పాల్గొన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, షేక్ కాజాహుస్సేన్ పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట మోహనరావు


నారాయణం దంపతులను సత్కరిస్తున్న మిత్రమండలి, ట్రస్ట్ సభ్యులు

అవధానంలో అందెవేసిన చేయి నారాయణంది

అద్దంకిటౌన్, ఆగస్టు 26 : అవధాన క్రీడలో అందెవేసిన చేయి నారాయణం బాలసుబ్రహ్మణ్యందని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ సహకారంతో గత మూడు రోజులుగా జరుగుతున్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం 4వ శతావధానం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పురస్కార సభకు డాక్టర్ దేవపాలన అధ్యక్షతన వహించారు. అవధానం ఒక పద్య క్రీడ అని, అందులో ఆరితేరిన అవధాని, పుంభావ సరస్వతి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అనంతరం ట్రస్ట్ తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలు శతావధాని బాలసుబ్రహ్మణ్యం దంపతులకును ఘనంగా సత్కారించి, పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు పోలూరి వెంకట శివరామ ప్రసాద్, వారణాసి రఘురామశర్మ, గాడేపల్లి దివాకర్ దత్తు, మురళి సుధాకరరావు, పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణులకు ప్రయోజనం కలిగేలా సర్వీసులు

ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహనరావు


హైదరాబాద్ సర్వీసును జెండా ఊపి ప్రారంబిస్తున్న డీఎం

అద్దంకి, ఆగస్టు 26 : గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. పమిడిపాడు నుంచి బీహెచ్ఈఎల్‌కు ప్రత్యేకంగా నడుపుతున్న బస్ సర్వీసును సోమవారం రాత్రి అద్దంకిలో డీఎం రామ్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ అద్దంకి డిపో నుంచి కొరిశపాడు, పంగులూరు మండలాలలోని పలు గ్రామాలను కలుపుతూ హైదరాబాద్‌కు ఒక బస్ సర్వీసు మాత్రమే నడుస్తుండగా, సోమవారం నుంచి అదనంగా మరో సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. చందలూరులో రాత్రి 9గంటలకు బయలుదేరి పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదుగా ఒక సర్వీసు, పమిడిపాడులో రాత్రి 9-20 గంటలకు బయలుదేరి రావినూతల, మేదరమెట్ల, అద్దంకి మీదుగా మరో సర్వీసు నడుస్తాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దంకి నుంచి బెంగళూరు, బ్రహ్మంగారి మఠం, చెన్నైకు కొత్త సర్వీసులు, హైదరాబాద్‌కు మరో సర్వీసు, శ్రీశైలంకు మరో సర్వీసు, ఒంగోలుకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఒంగోలుకు 2 పల్లెవెలుగు బస్సులు అదనంగా అవసరం ఉన్న విషయాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ మహబూబి, సీఆర్‌పీ కొండలు పాల్గొన్నారు.

కాపు కాసి.. కారును అడ్డుకొని

ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


టోల్ ప్లాజా వద్ద పోలీసుల అదుపులో ఉన్న ఎర్రకారు

మార్టూరు, ఆగస్టు 26 : సినీ ఫక్కీలో ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. సంఘటన సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మండల పరిధిలో ఒంగోలు వైపు రోడ్ బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జరిగింది. అనంతరం టోల్ ప్లాజా వద్దకు వచ్చిన తూర్పు గోదావరి జిల్లా నల్లచెర్ల స్టేషన్‌కు చెందిన పోలీసులు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని గుంటూరు వైపు వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి ఎర్రకారు ఒంగోలు వైపు వస్తుందని, దానిని అడ్డుకోవాలని మార్టూరు హైవే మొబైల్ వాహనంలోని పోలీసులకు నల్లచెర్ల స్టేషన్ పోలీసుల నుంచి సమాచారం వచ్చినట్లు తెలిసింది. దాంతో అప్రమత్తమైన మొబైల్ పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరి, గుంటూరు వైపు నుంచి వచ్చే ఎర్రకారు కోసం కాపు కాశారు. అంతేగాకుండా వారు టోల్ ప్లాజాకు అవతలవైపున ముందస్తు జాగ్రత్తగా జె.పంగులూరు మొబైల్ వాహన పోలీసులకు కూడా సమాచారం పంపించారు. దాంతో టోల్ ప్లాజా గేటు వద్ద కారు ఆగగానే పోలీసులు చుట్టుముట్టారు. కారు ముందు, వెనుక మొబైల్ వాహనాలను నిలపివేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న సీఐ శేషగిరిరావు తన సిబ్బంది, హైవే మొబైల్ వారితో కలిసి కారును, కారులోని యువకులను తనిఖీ చేశారు. అదే సమయానికి నల్లచెర్ల పోలీసులు టోల్ ప్లాజా వద్దకు చేరుకొని ముగ్గురు యువకులతోపాటు కారును అదుపులోకి తీసుకొని వెళ్లిపోయారు.


కారులో ఉన్న ముగ్గురు యువకులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



అద్దంకిలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు.. ఉట్టి కొడుతున్న చిన్నారులు

అద్దంకి, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలో నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో కృష్ణ మందిరంల ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, స్థానికులు పాల్గొన్నారు. పట్టణంలోని హరిహర గోకులంలో వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడు గోపిక వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఆదినారాయణ, ఐతా రాజా, డిస్ట్రిక్ ఆఫీసర్ చిన్ని మురళీకృష్ణ, వనితా క్లబ్ అధ్యక్షులు విజయలక్ష్మి, అంజలి, గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు పాల్గొన్నారు. మండలంలోని శింగరకొండపాలెంలో కృష్ణుని విగ్రహం వద్ద గ్రామస్థులు పూజలు నిర్వహించారు.

బల్లికురవ : బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కొణిదెన గ్రామంలో యజ్ఞం నారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో గోవులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా ముక్తేశ్వరం, కొప్పరపాడు, మల్లయ్యపాలెం, నక్క బొక్కలపాడు తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు కన్నుల పండుగగా చేశారు.

ఇంకొల్లు : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కృష్ణనగర్‌లోని కృష్ణమందిరంలో మహిళలు ప్రతేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పోటీలు నిర్వహించి బహమతులు అందజేసారు. శ్రీవరలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు తరుపున సుబ్బయ్య కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిత్రలేఖనం, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

పర్చూరు : శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులకు ఆలయ కమిటీ వారు బహుమతులను అందజేశారు. ఆలయంలో గోవులకు పూజలు చేశారు. కార్యక్రమంలో రావువారి ప్రసాద్, కృష్ణంశెట్టి జగదీష్, అర్చకులు బృందావనం సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పడమర బజారున శ్రీకృష్ణా యూత్ ఆధ్వర్యంలో యువకులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం యువకులు ఆట, పాటలతో సంబరాలు చేశారు. వలపర్ల గ్రామంలో నేతాజీ విద్యాలయంలో బాలికలు శ్రీకృష్ణుడు, రాధాగోపిక వేషధారణలో అలరించారు.


గో పూజ చేస్తున్న భక్తులు



షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న హరిబాబు, బాబూరావు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

అద్దంకిటౌన్, ఆగస్టు 26 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా అద్దంకి డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు సోమవారం స్థానిక శింగరకొండ వద్ద గల ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ముందుగా నిర్వహించిన షటిల్ పోటీలను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పూనాటి హరిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు ప్రారంభించారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటాలు చేయడంతో పాటు సామాజిక సంస్కృతిక కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడం కోసం స్వర్ణోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. డివిజన్ స్థాయిలో గెలుపొందిన టీమ్‌లు సెప్టెంబర్ 1వ తేదీన బాపట్లలో జరిగే జిల్లా స్థాయి పోటీలలోను, అక్కడ గెలుపొందిన వారు గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా షటిల్‌తో పాటు క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, రన్నింగ్, చెస్, కబాడీ వంటి పలు రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి బేతాళ పూర్ణచంద్రరావు, అధ్యక్షుడు ఈ రామారావు, గంగాధర్, శ్రీనవాసరావు, హనుమంతరావు, రామాంజనేయులు, రాజశేఖర్, బ్రహ్మజి పాల్గొన్నారు.


బాలికల ఖోఖో జట్టుకు ఎంపిక చేసిన క్రీడాకారిణులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

పంగులూరు, ఆగస్టు 26 : రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. సెప్టెంబరు 20 నుంచి 22 వరకు పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఈ జట్లు పాల్గొంటాయి. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 100 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో 25 మంది బాలురును, 25 మంది బాలికలను క్రీడా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలురకు ఈ నెల 27 నుంచి పంగులూరు జూనియర్ కళాశాల ప్రాంగణంలో, బాలికలకు జిల్లాలోని కంచర్లవారిపల్లె ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, పీడీలు కె.హనుమంతరావు, డి.రమాదేవి, జె. శ్రీనివాసులు, ఎం.సౌజన్య, కె.ప్రసాద్, పీఈటీలు వసంత రఘుబాబు, సావిత్రమ్మ, వీరాంజనేయులు, అజయ్ పాల్గొన్నారు. బాలురకు జె.పాల్, డి.లక్ష్మీనారాయణ, బాలికల జట్టుకు కాశీవిశ్వనాథరెడ్డి, పి.శ్రీనివాసరావు శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఏపీపీయూఎస్ఎంఏ జిల్లా నూతన కార్యకర్గం ఏకగ్రీవం


చీరాల : నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యకవర్గం


పర్చూరు : నూతన కార్యవర్గ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 26 : ఏపీపీయూఎస్ఎంఏ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, మేనేజిమెంట్స్ అసోసియేషన్) జిల్లా నూతన కార్యకర్గంను స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్ణీత నిబంధనల మేరకు రాష్ట్ర ఎలక్షన్ ఆఫీసర్స్‌గా బాధ్యతలు నిర్వహించినవారు ఏకగ్రీవంగా ఎంపిక జరగటంపట్ల అభినందించారు. సంఘ జిల్లా గౌరవ అధ్యక్షునిగా టి.విజయ్‌కుమార్(ఆదర్శ స్కూల్స్, ఇంకొల్లు), జిల్లా అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వర్లు(ఎంవీ)(శ్రీ గౌతమి స్కూల్స్, చీరాల), వైస్ ప్రెసిడెంట్‌గా అంజిరెడ్డి మన బాలభారతి స్కూల్స్(సంతమాగులూరు అడ్డరోడ్డు, అద్దంకి), జనరల్ సెక్రటరీగా ఎస్.రవిశంకర్(రైన్‌బో స్కూల్, రేపల్లె), జాయింట్ సెక్రటరీగా బ్రహ్మం(మహాత్మాగాంధీ స్కూల్, అద్దంకి), కోశాధికారిగా వి. నాగేశ్వరరావు(సిద్ధార్థ స్కూల్, బట్టిప్రోలు), ఇసి మెంబర్స్‌గా హయగ్రీవాచారి (బాలభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గూడవల్లి,రేపల్లె), రామకృష్ణ (గీతాంజలి స్కూల్, ఈపురుపాలెం, చీరాల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా అడుగులు వేస్తూ మెరుగైన ఫలితాలు సాధిద్దామన్నారు. అలానే అసోసియేషన్ తరపున ఉమ్మడి అవసరాలు, సమస్యల పరిష్కారానికి ఎప్పుడు సమష్టిగా ముందడుగు వేద్దామని తీర్మానించారు. ఎలక్షన్ ఆఫీసర్స్‌గా బాధ్యతలు నిర్వహించిన సంఘ బాధ్యులు, తోటి కరస్పాండెట్స్, సంఘీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

అపుస్మా అధ్యక్షునిగా రాము

పర్చూరు : అపుస్మా పర్చూరు నియోజకవర్గ అధ్యక్షునిగా పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన తేళ్ల వెంకట రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు అధ్యక్షతన పర్చూరులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, కార్యదర్శిగా చిలుకూరి శ్రీధర్‌రావు, కోశాధికారిగా శ్రీనివాసరావు, సభ్యులుగా ఆంజనేయులు, లక్ష్మయ్య చౌదరి, ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.